ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు
జిల్లా వార్తలు

1

మంగళవారం 3 జూన్ 2025



తల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

■ లోపలి పేజీలో..



సీఎం చంద్రబాబుతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని, పత్సమట్ల

కొల్లేరు సమస్యకు పరిష్కారం

▸ సీఎం చంద్రబాబు

కైకలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి):పర్యావరణానికి, పేదలకు మేలు జరిగేలా కొల్లేరు సమస్య పరిష్కరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కొల్లేరుపై సీఎంతో విజయవాడలో సోమవారం రెండు గంటలపాటు చర్చించినట్లు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ 'నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు నిబంధనల మేరకు కొల్లేరులోని 20 వేల ఎకరాల బీఫామ్ పట్టాలు, జిరాయితీ భూములను కాంటూరు సరిహద్దులోకి తీసుకువచ్చి పేదలకు న్యాయం జరిగేలా చూడాలి. పర్యావరణం, పక్షులతోపాటు ప్రజలు జీవించాలనేది దృష్టిలో ఉంచుకోవాలి. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బీఫాం పట్టాలు, జిరాయితీ భూములను సరిహద్దులకు తీసుకువచ్చి అందించాలి. ఆ దిశగానే అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలి' అని చంద్రబాబు సూచించినట్లు కామినేని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ యుగంలోను.. ఆగని సైకిల్



■ లోపలి పేజీలో..

నేడు ప్రపంచ సైకిల్ దినం

ఎప్పుడిస్తారు!



ఆ రెండింటి కోసమే.. అంతా ఎదురుచూపులు

ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వరాల్లో అత్యంత కీలకమైనవి అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉన్నా ఫర్లేదు.. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు, ఇంకోవైపు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులను ఆదుకునేందుకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇస్తామంటూ టీడీపీ హామీ ఇచ్చింది. ఇప్పుడు ఈ రెండు పథకాల సొమ్మును ఎప్పుడొచ్చి పడతాయా అని లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు.

▸ బడులు తెరవకముందే 'తల్లికి వందనం' కావాలంటున్న తల్లులు
▸ అన్నదాత సుఖీభవలోనూ ఇదే టెన్షన్
▸ గతం కంటే అర్హులైన రైతులకే సొమ్ములు
▸ ఇప్పటికీ అర్హుల జాబితాలతో కుస్తీలు..
▸ ఇంకా ఖరారు కాని తేదీలు..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జూన్ వచ్చిందంటే చాలు తల్లుల దగ్గర నుంచి రైతుల వరకు అందరిదీ ఒకటే టెన్షన్. ఒకవైపు విద్యాసంవత్సరం ప్రారంభమైతే మరోవైపు రైతులకు వ్యవసాయ సీజన్ మొదలవుతుంది. ఈ క్రమంలో అన్ని కుటుంబాల్లో సొమ్ములతోనే పని. ఈ నేపథ్యంలోనే ఈ రెండు పథకాలు వర్తించే లబ్ధిదారులంతా ఇంతకు ముందు ప్రభుత్వంలో కాస్తోకూస్తో సర్కారు సొమ్ము తమ ఖాతాలో పడినవారే. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం రైతు పక్షాన నిలిచేలా అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు రైతుకు అందించేలా హామీ ఇచ్చింది. ఇప్పుడా ఆ హామీని ఇదే నెలలో అందించాలని లక్ష్యంలో సర్కారు ఉంది. ఇప్పటికే గత నెల నుంచి ఈ పథకం కింద వర్తించే లబ్ధిదారుల సంఖ్యను పరిపరి విధాలుగా క్షుణ్ణంగా శోధించారు. ఈ పథకానికి తాము అర్హులమేనని జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా దరఖాస్తులు పరిశీలనకు వచ్చాయి. వీటిని ఆసాంతం పరిశీలించిన తర్వాత 15 వేలకు పైగా దరఖాస్తుల్లో తప్పుల తడకగా ఉండడంతో వీటిని మరోసారి పరిశీలించేందుకు తహసీల్దార్లకు చేర్చారు. ఇంకోవైపు సుమారు లక్షాపదిహేను వేలకు పైగా దరఖాస్తులను తోసిపుచ్చారు. ఇదే తరుణంలో కౌలు కార్డులు కలిగిన వారికి ఈ పథకం వర్తింపజేయాలన్న ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికివరకు 75వేల మంది కౌలుదారులుండగా వారిలో కార్డులు చేతికందినవి కేవలం ఎనిమిదివేల మందికే. దీంతో ఈ పథకం ఎప్పటి నుంచి వర్తింపచేస్తారో, అర్హుల జాబితాలో తాము ఉన్నామో లేదో తెలుసుకోవడానికి రైతులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. జగన్ జమానాలో రైతు భరోసా కింద కేవలం 2లక్షల35వేల మందికే నాలుగేళ్లకు కలిపి రూ.1,838 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశారు.

తల్లుల్లో టెన్షన్..టెన్షన్


అప్పుడు అమ్మఒడి.. ఇప్పుడు తల్లికి వందనం. పథకాలు పేరు మారినా వీటి కింద లబ్ధిదారులకు అందబోతున్న సొమ్ము అంతే భిన్నంగా ఉంది. జగన్ జమానాలో అమ్మఒడి కింద కేవలం పిల్లల్లో ఒకరికి మాత్రమే ఏడాదికి రూ.13 వేలు తల్లుల ఖాతాలో జమ చేసేవారు. కానీ ఇప్పుడు తల్లికి వందనం పేరిట తెలుగుదేశం ప్రభుత్వం ఒక ఇంట్లో చదువుకునే పిల్లలందరికి ఏడాదికి రూ.15 వేల (మిగతా 4వ పేజీలో)

బదిలీలకు వారం గడువు పొడిగింపు

ఏలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి):అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు మరో వారం గడువు పెంచుతూ ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి పీయూష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. వాస్తవానికి బదిలీల గడువు సోమవారంతో ముగిసింది. తాజాగా ఈ నెల 9వ తేదీ వరకు పొడించడంతో ఆలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. జూన్ 10 నుంచి నిషేధాజ్ఞలు అమల్లోకి రానున్నాయి. ఏలూరు, పశ్చిమ గోదారి జిల్లాల్లో ప్రధానంగా పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల్లో చాలా వరకు బదిలీలకు దరఖాస్తులు రాలేదని సమాచారం. కొన్ని శాఖల్లో బదిలీల కసరత్తులు పూర్తి కాకపోవడం, భారీ వర్షాలు, పలు సర్వేలు, ఇతర అంశాలు ముడిపడడంతో గడువును పొడిగించినట్టు తెలుస్తోంది.

మరొకరికి కొవిడ్

▸ జిల్లాలో 11కి చేరిన కరోనా కేసులు



ఏలూరు అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం కొవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. వివరా లను జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్‌పీ విభాగం వైద్యాధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ వెల్లడించారు. ఏలూరుకు చెందిన ఓ మహిళ (35) కొవిడ్ లక్షణాలతో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సోమవారం రాగా, వైద్యుల సూచనల మేరకు ఆర్టీపీసీఆర్ టెస్టు చేయగా పాజిటివ్ నిర్ధారణ అయింది. బాధితురాలిని హోం ఐసోలేషన్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఆమె ఆరోగ్యస్థితి నిలకడగా ఉంది. తాజా కేసుతో జిల్లాలో కొవిడ్ పాజిటివ్ బాధితుల సంఖ్య 11కి చేరింది.

5న ఐటీఐల్లో తొలి విడత అడ్మిషన్లకు కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఐదు ప్రభుత్వ ఐటీఐలు (804 సీట్లు), 14 ప్రైవేటు ఐటీఐ (1,672 సీట్లు)ల్లో తొలివిడత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్‌ను ఈ నెల 5న ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ కన్వీనర్ పి.రజిత తెలిపారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థి మెరిట్ నంబరు 1నుంచి 110 వరకు, మధ్యాహ్నం ఒంటిగంటకు మెరిట్ నంబరు 111నుంచి 202 వరకు అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.



ఈడా చైర్మన్‌గా శివప్రసాద్ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆప్కాబ్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు..చిత్రంలో ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్ తదితరులు

నగర అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

▸ మంత్రి కొలుసు పార్థసారథి
▸ ఈడా చైర్మన్‌గా శివప్రసాద్ ప్రమాణ స్వీకారం

ఏలూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఈడా) చైర్మన్ పెద్దిబోయిన వాణి వెంకట శివప్రసాద్‌కు సూచించారు. స్థానిక చలసాని గార్డెన్స్‌లో సోమవారం ఈడా చైర్మన్‌గా శివప్రసాద్ ప్రమాణస్వీకారోత్సవ సభ జరిగింది. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంకిత భావంతో ప్రజలకు సేవలు చేసిన వారికి పదవులు లభిస్తాయనడానికి శివప్రసాద్ నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ పెద్దిబోయిన శివప్రసాద్ క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు నగరాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఆప్కాబ్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు శివ ప్రసాద్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, మాజీ మంత్రి మారడాని రంగారావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కూటమి నాయకులు పుప్పాల జగదీశ్‌బాబు, చీడే వెంకటరత్నం, దాసరి ఆంజనేయులు, మధ్యాహ్నపు బలరాం పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే రోషన్‌కుమార్, జేసీ ధాత్రిరెడ్డి

సకాలంలో ఫిర్యాదులకు పరిష్కారం

▸ కలెక్టర్ వెట్రిసెల్వి.. చింతలపూడిలో అర్జీల స్వీకరణ

చింతలపూడి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందిన ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపుతామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, జేసీ ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ వినతులను స్వీకరించారు. మొత్తం 312 వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే పరిష్కార లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో అధిక భాగం రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యక్తిగత అర్జీలు ఉన్నాయి. డీఆర్‌డీఏ ఏపీడీ ఆర్.విజయరాజు, డీసీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, డీఎస్పీ రవిచంద్ర, మునిసిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) :దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదు పరిశీలించి సత్వర న్యాయం చేస్తామన్నారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా
అనుమతి లేదు

ఈ నెల 6 నుంచి 30 వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.. 34,218 మంది అభ్యర్థులు - 44 సెషన్లు

ఏలూరు అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ- 2025 రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఈ నెల ఆరో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి పశ్చిమలోని ఎనిమిది ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 44 సెషన్స్‌లో 34,218 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

- **సబ్జెక్టుల వారీగా పరీక్షలు :** స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీజీటీ(నాన్ లాంగ్వేజెస్) పరీక్షలకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్, పీజీటీ(లాంగ్వేజెస్) పరీక్షలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష వేళలను నిర్ణయించారు. ఇంగ్లీష్ ప్రొఫీషియన్సీ టెస్టును ఆయా రోజుల్లో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. టెస్టు సెంటర్ సామర్థ్యానికి అనుగుణంగా సెషన్‌కు 102 మంది నుంచి 211 మంది పరీక్షార్థుల వరకు హాజరయ్యేలా ఆయా రోజుల్లో విద్యార్థుల సంఖ్యను నిర్ధారించారు. మొత్తం 44 సెషన్లలో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 34,218 మంది అభ్యర్థులు హాజరయ్యేలా ఖరారు చేశారు. టెస్టు సెంటర్ల సామర్థ్యానికి అనుగుణంగా ఈ నెల 16 నుంచి 20 వరకు అభ్యర్థులను కేటాయించారు. మిగతా రోజుల్లో కొన్ని సెంటర్లలో పరీక్షలు ఉండవు. దివ్యాంగుల కోసం 14, 23 తేదీల్లో కొన్ని సెంటర్లను ప్రత్యేకించారు.
- **మొత్తం పోస్టులు :** ఉమ్మడి జిల్లా 48 మండలాలు, మున్సిపాల్టీలు, ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో గవర్నమెంట్/ స్థానిక సంస్థల యాజమాన్యాల పాఠశాలల్లో 822 పోస్టులు, పురపాలక సంఘాల పరిధిలో 168, ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 45 పోస్టులు కలిపి 1035 ఉపాధ్యాయ నియామకాలకు ఈ మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు హాల్ టిక్కెట్ల జారీ ఇప్పటికే ప్రారంభం కాగా, పాటించాల్సిన నిబంధనలు, మార్గదర్శకాలను వాటిపై ముద్రించారు.

పరీక్ష కేంద్రాలు.. సమయం

- తాడేపల్లిగూడెం వాసవి, శశి, భీమవరం డీఎన్నార్(2), నరసాపురం స్వర్ణాంధ్ర, ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు, సీఆర్ రెడ్డి, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలు.
- ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. పరీక్ష ప్రారంభ సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా సెంటర్‌లోకి అనుమతించరు.

ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్‌గా
జయలక్ష్మి బాధ్యతలు



ఏలూరు అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్‌గా ఎ.జయలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. డీజీఈ రాష్ట్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఈమెకు మే 12న ఏసీగా పదోన్నతి ఇవ్వగా తాజాగా బదిలీపై జిల్లాకు నియమించారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్నందున, అది పూర్తయ్యే వరకు నిబంధనల ప్రకారం ఇంతవరకు విధులు నిర్వర్తించినవారే ఏసీగా కొనసాగాలి. ఇప్పటివరకు జిల్లాలో ఏసీగా పనిచేసి కడప జిల్లా ఏసీగా బదిలీ అయిన ఎల్.శ్రీకాంత్ అక్కడ విధుల్లో చేరిన అనంతరం రిలీవై, మళ్లీ జిల్లాలో టెన్త్ మూల్యాంకనం ప్రక్రియ పూర్తయ్యేవరకు అంటే మరో రెండునెలల పాటు డిప్యుటేషన్‌పై ఇక్కడ ఏసీగా విధులు నిర్వర్తిస్తారు. కాగా బదిలీపై సోమవారం జిల్లాలో ఏసీగా బాధ్యతలు చేపట్టిన జయలక్ష్మి డీఈవో వెంకటలక్ష్మమ్మను కలుసుకుని తన నియామకపత్రాలను అందజేశారు. ఆమెను పలు ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి డీఆర్పీలకు శిక్షణ

సెకండరీవిద్యలో కొత్తగా ప్రవేశపెట్టనున్న టీచర్ హ్యాండ్‌బుక్, కరికులం ఇంటిగ్రేషన్ అండ్ అసెస్‌మెంట్ బుక్‌లెట్, తదితర అంశాలపై డీఆర్పీ (జిల్లాస్థాయి రిసోర్స్‌పర్సన్స్)లకు మూడురోజుల శిక్షణను మంగళవారం నుంచి ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో ప్రారంభిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు తెలిపారు. లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్టు వారీగా శిక్షణ పొందాల్సిన డీఆర్పీల జాబితాను సోమవారం విడుదల చేశారు. శిక్షణ నిమిత్తం జిల్లాలోని డివిజన్లు, మండలాల వారీగా ఎంపికచేసిన డీఆర్పీలు తప్పని సరిగా హాజరుకావాల్సిందేనని స్పష్టం చేశారు. జాబితాల్లోవున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులందరినీ శిక్షణకు హాజరయ్యేలా విధుల నుంచి రిలీవ్‌చేసి పంపాలని డీవైఈవోలు, ఎంఈవోలను ఆదేశించారు.

అధికారితో..



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సకాలంలో సెంటర్లను తెరవకపోవడం, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం సకాలంలో అందడం లేదా..? తదితర సమస్యలపై ఈనెల 4వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. గర్భిణులు, లబ్ధిదారులు, ప్రజలు

94408 14587

నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద చర్యలు తీసుకుంటారు.



ఎం.నాగులపల్లిలో ధర్నా చేస్తున్న ఆయిల్ పామ్ రైతులు

ఆయిల్ పామ్ రైతుల ధర్నా

ద్వారకాతిరుమల, జూన్2 (ఆంధ్రజ్యోతి): ముడి పామోలిన్‌పై దిగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి కేంద్రం తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయిల్‌పామ్ రైతులు ఎం.నాగులపల్లిలోని గెలల కాటా వద్ద సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఫ్యాక్టరీల యాజమాన్యాలు గెలల ఏరివేతను ఆపాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్రసహాయ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో గెలల ధర బాగా తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కట్లా భాస్కరరావు, బిసత్యనారాయణ, తూంపాటి మురళి, దొరబాబు, సత్యనారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.





ఆకివీడు, ముదినేపల్లిలో వాహనదారుల పాట్లు



పాలకొల్లులో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి, పోలవరంలో జన సంచారం లేని రహదారి

ఎండ మండే

భానుడి ప్రతాపం.. ఉక్కబోతతో విలవిల

ఈ ఏడాది మే నెల వర్షాలు, మబ్బులతో గడిచింది. ఎండ ప్రభావం పెద్దగా లేదు. నెలాఖరులో రోహిణి కార్తె ఆరంభమైనా వాతావరణం చల్లగానే ఉంది. జూన్ ఆరంభం మాత్రం సెగలు రేపింది. ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉమ్మడి జిల్లాలో సోమవారం 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి ఆఖరులో సూర్య ప్రతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఎండ ప్రభావంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్న సమయంలో దుకాణాలు మూసి వేశారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ వేడిగాలులతో కంటినిండ నిద్ర ఉండడంలేదని జనం వాపోతున్నారు. పాలకొల్లు పట్టణం జన సంచారం లేక బోసిపోయింది. తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏలూరు నగరంతో పాటు జిల్లాలో ఉష్ణోగ్రత తీవ్రస్థాయిలో ఉండడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలలో ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గింది. మరోవైపు అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యుత్ కోతలు లేదని అధికారులు చెబుతున్నా చాలా ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ముదినేపల్లి - గుడివాడ, కైకలూరు జాతీయ రహదారులు, నిత్యం రద్దీగా ఉండే గురజ రోడ్డు సెంటర్‌లో జన సంచారం లేదు. పోలవరంలో మెయిన్ రోడ్, బజారులో జన సంచారం లేక బంద్ వాతావరణాన్ని తలపించాయి.

ఏలూరు సిటీ, పాలకొల్లు అర్బన్, తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు, ఆకివీడు, ముదినేపల్లి, పోలవరం



తాడేపల్లిగూడెం మాధవరంలో ముసుగు ప్రయాణం

క..క.. కరోనా!

కలెక్టరేట్‌లో కొవిడ్ రక్షణ చర్యలు కట్టుదిట్టం



మాస్కులు ధరించిన అర్జీదారులు, అధికారులు

ఏలూరు జిల్లా కలెక్టరేట్‌ను కరోనా కుదిపేస్తోంది. గత వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఒక అధికారి కొవిడ్ లక్షణాలతో ఇబ్బంది పడ్డారు. కార్యక్రమం ముగిసిన మరుసటి రోజు అస్వస్థతకు గురైన ఉద్యోగులు పరీక్షలు చేయించుకుంటే మొత్తం ఐదుగురికి కొవిడ్ నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి అధికారులు పూర్తి రక్షణ చర్యలు తీసుకున్నారు. అధికారులంతా మాస్కులు ధరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులందరికీ మాస్కులు ఇవ్వడంతో పాటు శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసిన తర్వాత లోనికి పంపించారు. అర్జీల నమోదు సిబ్బంది మొత్తం మాస్కులు ధరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్య సిబ్బంది శిబిరం ఏర్పాటుచేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

– ఫొటోగ్రాఫర్, ఏలూరు




అర్జీదారులకు శానిటైజర్, మాస్కులు ధరించి అర్జీలు నమోదు చేస్తున్న సిబ్బంది



కలెక్టరేట్ వద్ద మాస్కులు, మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

స్పీడ్ యుగంలో కూడా

ఆగని సైకిల్

నేడు ప్రపంచ సైకిల్ దినం

- గ్రామీణ ప్రాంతాల్లో వన్నె తగ్గని సైకిల్
- పాఠశాల విద్యార్థులు, పిల్లలకు సరదా సరదా
- సైక్లింగ్‌తో మంచి ఆరోగ్యం, పర్యావరణ హితం



చక్రం కనుగొనడంతోనే మానవ నాగరికత అభివృద్ధి చెందింది. చెక్కతో చక్రం తయారు చేసి వాటిని రథాలు, బండ్లకు అమర్చి గుర్రాలు, ఎద్దులు, దున్నలతో లాగించడం ద్వారా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణం మొదలైంది. క్రమేపీ సైకిల్ తయారీతో మనిషి ప్రయాణం వేగం అందుకుంది. సామాన్యులకు సైకిల్ ఎంతో చేరువ అయింది. అంతేకాదు పూర్వ కాలం సైకిల్ హోదా. వివాహ సందర్భంగా, పండుగలకు అల్లుళ్లకు సైకిల్ కానుకగా ఇవ్వడం ఒక ఆచారంగా సాగింది. ప్రస్తుతం సైకిల్‌ను మించిన వేగంతో మోటార్ వాహనాల రాకతో సైకిల్ వెనుకబడింది. అయినప్పటికీ సైకిల్ ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదు. పాఠశాల పిల్లలకు సైకిల్ ఎంతో సరదా.. పెద్దలు సైకిల్ తొక్కడం ఆరోగ్యం అని వైద్యులు సూచిస్తున్నారు. మే 3 ప్రపంచ సైకిల్ దినం సందర్భంగా..

తణుకు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సైకిల్ పర్యావరణానికి హాని కలగని సామాన్యుని ప్రయాణ సాధనం. ఎంత ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినా సైకిల్ ప్రయాణం ఆగలేదు. నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని మరీ సైకిల్ పరుగులు తీస్తోంది. సంప్రదాయ సైకిల్‌తో పాటు గేర్, మోటార్ సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. సైకిల్ తొక్కడం ద్వారా మనిషికి మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుంది. పర్యావరణానికి ఏమాత్రం హాని ఉండదు. 2018లో ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మే 3న ప్రపంచ సైకిల్ దినంగా ప్రకటించింది. సైకిల్ తొక్కడం వలన ఆరోగ్య ప్రయోజనాలతో ఇంధనంతో నడిచే కార్లు, మోటారు సైకిల్ వల్ల వెలువడే కాలుష్య కారకాలను కొంతైనా తగ్గించాలనేది సైకిల్ దినోత్సవ లక్ష్యం.

సైకిల్ ఒకప్పటి సౌకర్యవంతమైన విలాసవంతమైన ప్రయాణ సాధనం, మొదటి తరం సైకిల్స్‌లో ర్యాలీ, అంబర్, రిడ్జి, ఏవన్, ఉండేవి. 90 దశకం వరకూ ర్యాలీ, అంబర్, రిడ్జి సైకిళ్లు అప్పటి తరాన్ని ఎంతో ఆకర్షించాయి. వాటిలో కొన్ని పూర్తిగా కనుమరుగైతే మరికొన్ని వేరే పేర్లతో రూపాంతరం చెందాయి. తర్వాత వచ్చిన హీరో, బీఎస్ఏ సైకిల్ సైకిల్స్ వినియోగంలో కొత్త ఒరవడిని తీసుకొచ్చాయి. కొత్తగా ఎన్ని రకాలు సైకిల్స్ అందుబాటులో వున్నా పాత తరం ర్యాలీ, అంబర్, రిడ్జి, ఏ వన్ సైకిళ్లను ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో వినియోగిస్తున్నారు. కొంతమందికి మోటారు సైకిల్, కార్లు ఉన్నప్పటికీ పాత సైకిల్ మరమ్మతు చేయించుకుని వినియోగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాత ర్యాలీ, అంబర్, రిడ్జి వంటి సైకిళ్లను కొనుగోలు చేసి మరమ్మతు చేయించుకుంటున్నారు. ఒక్కో పాత సైకిల్‌ను రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ వెచ్చించి నేటికీ కొనుగోలు చేస్తున్నారు. మరి కొందరు పూర్వీకులు నుంచి వచ్చిన సైకిళ్లను జాగ్రత్తగా వాడుకుంటున్నారు. కొత్త రకం సైకిల్స్ ఎన్ని హంగులతో వచ్చినా వారు ర్యాలీ, అంబర్ సైకిల్‌నే వాడతారు.



సైకిల్ ప్రస్థానం ఇదీ..

చెక్క సైకిల్ అనేక రూపాంతరాలతో ప్రస్తుత సైకిల్ అందుబాటులోకి వచ్చింది. 1850 నుంచి ఇటలీ, స్కాట్‌లాండ్, జర్మనీ ఇంజనీర్లు సైకిల్ తయారీ ప్రారంభించారు. మొదటి తరం సైకిల్‌కి ఒకే చక్రానికి ఫెడల్ అమర్చి ఉండేది. తర్వాత రెండు చక్రాల సైకిల్ తయారు చేశారు. వెనక చక్రానికి ఫెడల్ అమర్చి ముందు చక్రం పెద్దగా ఉండేది. తర్వాత 1890లో జెన్ స్టాన్లీ రోవర్ సైకిల్‌ను తయారు చేశారు. ప్రస్తుతం మన వాడుతున్న రెండు చక్రాల మధ్యలో ఫెడల్ సైకిల్ సౌకర్యవంతంగా ఉండడంతో ప్రపంచమంతా వాడుకలోకి వచ్చింది. 1920లో పిల్లల కోసం ప్రత్యేకంగా సైకిల్స్ అందుబాటులోకి వచ్చాయి. అనంతరం 1960లో రేసింగ్ సైకిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మోటారు సైకిల్స్ మాదిరి గేర్ సైకిల్స్, బ్యాటరీ సైకిల్స్ అందుబాటులోకి వచ్చాయి.



మా పెళ్లికి బహుమతి సైకిల్ ఇప్పటికీ వాడుతున్నా

సుమారు 56 ఏళ్ల క్రితం అత్తింటి వారు సైకిల్ బహుమతిగా ఇచ్చారు. అప్పటికే అది పాత సైకిల్. అదే సైకిల్ ఇప్పటికీ వాడుతున్నాను. నేను పాఠశాలకు వెళ్లలేదు. కొంచెం వయస్సు వచ్చిన తర్వాత పొలం వెళ్లి పని చేయడం అలవాటు చేసుకున్నాను. సైకిల్‌పై పొలం వెళ్లే వాడిని. మొదటి నుంచీ సైకిల్‌పైనే రాకపోకలు. బంధువుల ఇంటికి వెళ్లాలన్నా.. ఇతర దూర ప్రాంతాలకు సైతం సైకిల్‌పై ప్రయాణం చేసేవాడిని. 56 ఏళ్ల నుంచి నా సైకిల్ ఎప్పుడు మరమ్మతుకు గురైనా కొత్త పార్టులు వేయడం తప్ప ఇప్పటికీ మార్చలేదు. ఉత్సాహంగా సైకిల్‌పై పొలం వెళతాను. ఊరిలో తిరుగుతాను. రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది.

– రెడ్డి వెంకట కృష్ణారావు, వేల్పూరు



సైకిల్ షాపుతో జీవనం.. ముగ్గురిని చదివించా

మా తండ్రి బాబూరావు స్థాపించిన సైకిల్ షాపులో పని నేర్చుకున్నాను. సైకిల్ రిపేరు వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటూ ముగ్గురు పిల్లలను చదివించా. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తుండగా, మరొకరు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్నారు. 60, 70 దశకాలలో ర్యాలీ, అంబర్ సైకిల్స్ ఇప్పటికీ గ్రామంలో రైతులు ఎంతో మక్కువతో భద్రపర్చుకుంటున్నారు. కార్లు, మోటారు సైకిల్స్ ఉన్నా సైకిల్‌నే గ్రామంలో అన్ని పనులకు వినియోగిస్తున్నారు. పాత ర్యాలీ, అంబర్ సైకిళ్లను ఎక్కువ ఖరీదు పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

–పున్నం శ్రీనివాసులు, సైకిల్ మెకానిక్, కావలిపురం.

పర్యావరణానికి ఇబ్బందిలేని వాహనం..

సైకిల్ వినియోగం స్వశక్తితో గమ్య స్థానానికి చేరడంతో పాటు పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందిలేని వాహనం. సైకిల్ తొక్కడం మానవుని గుండె, ఊపిరితిత్తులకు మంచి వ్యాయామం. శరీరంలోని నడుము కింది బాగంలో తొడ, తుంటి భాగం పిక్క కండరాలకు మంచి వ్యాయామం. సైక్లింగ్ చేయడం వలన దేహంలోని శక్తి కేలరీలలో ఖర్చుఅవడం వలన శరీరంలోని కొవ్వు నిల్వలు చేరకుండా ఆరోగ్యంగా ఉంచుతుంది. సైకిల్ తొక్కడం వలన స్వశక్తిపై నమ్మకం పెరుగుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

–ఎస్వీ సతీష్ బాబు, జిమ్ ట్రైనర్, తణుకు.



మే పుష్పం కనువిందు




ఉండి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలివర్రులో రుద్రరాజు పుల్లంరాజు ఇంటి పెరట్లో మే పుష్పాలు కనువిందు చేశాయి. ఇవి సాధారణంగా మే, జూన్‌లో కనిపిస్తాయి. ఒకేసారి పూచిన మూడు పుష్పాలు ఆకట్టుకున్నాయి. పక్కనే నాలుగైదు మొక్కలు పూవులు పూయడానికి సిద్ధంగా ఉన్నాయి. బ్లడ్ లిల్లీ, ఫుట్‌బాల్ లిల్లీగా పిలిచే ఈ పూవులు ఏడాదిలో ఒకసారి మాత్రమే వికసిస్తాయి.

ప్రపంచ సుందరికి డాక్టర్ దశరథ రామారెడ్డి అభినందన



ప్రపంచ సుందరి కిరీటం దక్కించుకున్న థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత షుంగ్‌సిరికి సోమవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యుడు టి.దశరథరామారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అమెరికాకు చెందిన వైద్యుడు సంజోగ్ మాథుర్ కూడా ఉన్నారు.



కొబ్బరి బొండం.. తాటి ముంజలు

కూల్.. కూల్..

చలచల్లగా ఆరంభమైన రోహిణి కార్తె ఒక్కసారిగా ప్రభావం చూపడంతో ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం కోసం కొబ్బరి బొండాలు, తాటి ముంజలను ఆశ్రయిస్తున్నారు. చల్లదనంతో పాటు చక్కటి ఆరోగ్యం కూడా ఇస్తాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో ఆరుబయట దుకాణాలు వేసి విక్రయిస్తున్నారు.

గణపవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండుతున్న వేసవిలో తక్షణ ఉపశమనం కొబ్బరి బొండం. వేసవి వచ్చిందంటే ఒక వైపు కొబ్బరి బొండాలు, మరోవైపు తాటిముంజలు, చల్లదనం ఇస్తాయి. అతిశీతల (ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింకులు) పానీయాలతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతతాయి. కొబ్బరి బొండాలు, తాటిముంజలు చల్లదనంతో పాటు ఆరోగ్యం. ప్రస్తుతం సీజన్ కావడంతో రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కొబ్బరిబొండాలు వస్తుండటంతో ధర కూడా అధికంగా పలుకుతున్న పరిస్థితి నెలకొంది. బొండం రూ.25- 30, లీటరు బాటిల్ రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు.

పోషకాల గని

కొబ్బరిబొండాలు, తాటిముంజల్లో పలు పోషకాలున్నాయి. కొబ్బరిబొండాల్లో 94శాతం నీరు, పిండి పదార్థాలు, 3గ్రాములు ఫైబర్, 2గ్రాములు ప్రోటీన్, 10శాతం ఆర్‌డీఐ విటమిన్ సీ, 2గ్రాములు ప్రోటీన్, ఆర్‌డీఐ మెగ్నీషియం 15శాతం, ఆర్‌డీఐ మాంగనీసు 17శాతం, ఆర్‌డీఐ పోటాషియం 17శాతం, ఆర్‌డీఐ సోడియం 11శాతం, కాల్షియం 6శాతం ఉంటాయి.



కొబ్బరి నీటితో ఆరోగ్యం

పోషకాలతో నిండిన కొబ్బరి నీరుతో మంచి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కొబ్బరి నీరు డిహైడ్రేషన్ సమస్యను నివారిస్తుంది. యాంటీయాక్సిడెంట్లు శరీరానికి రక్షణనిస్తాయి. తాటిముంజల్లో నీటి శాతం అధికం. ఇది కూడా డీహైడ్రేషన్ నుంచి కాపాడుతుంది. విటమిన్ బీ, ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉన్నాయి. వేసవిలో దివ్యఔషదంగా ఉపయోగపడతాయి. సులభంగా జీర్ణమవుతాయి.

కె.ప్రియాంక, పీహెచ్‌సీ వైద్యాధికారి, పిప్పర





నేటి నుంచి కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ద్వారకాతిరుమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ఈవో ఎన్వీ.సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచన, రుత్విగ్వరణ, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, అంకురార్పణ, జరుగుతాయన్నారు. ఈనెల 4న ఉదయం సర్వతో భద్ర మండలి ఆరాధన, మూలమంత్ర అనుష్టానం, హోమాలు. జరుగన్నాయి. 5న ఉదయం 8గంటలకు ఉత్సవ మూర్తికి నవకలశ స్నపన, శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ. హోమాలు, మహా పూర్ణాహుతి ఆశీర్వచనం, పండితసత్కారం జరుగనున్నట్లు ప్రధాన అర్చకుడు భైరవ స్వామి వివరించారు.

నరసాపురం పార్లమెంట్‌కు మేలు చేయడమే లక్ష్యం

» త్వరలో నరసాపురం నుంచి వందే భారత్ » మంత్రి వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ

భీమవరం టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులైన జాతీయ రహదారులు, రైల్వేల ద్వారా నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు సాధ్యమైనంత మేలు చేకూర్చడమే తన లక్ష్యమని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ స్పష్టం చేశారు. సోమవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆకివీడు మండలంలో రైతుల నుంచి నేషనల్ హైవే కోసం 28.95 ఎకరాలు సేకరించారని, వారికి ఆరేళ్ల తర్వాత మొత్తం రూ. 24.95 కోట్ల నష్టపరిహారం మంజూరైందన్నారు. తొలివిడతగా రూ. 7.47 కోట్ల పరిహారం అందజేశామన్నారు. నేషనల్ హైవే 165లో రెండో దశలో 2 లైన్‌లుగా ఉన్న అజ్జమూరు-దిగమర్రు మధ్య భీమవరం బైపాస్‌తో కలిపి రహదారిని 4 లైన్లుగా మార్చామని, త్వరలోనే రూ. 2వేల500 కోట్లతో పనులు ప్రారంభిస్తామన్నారు. గతి శక్తి పథకంలో భాగంగా లెవల్ క్రాసింగ్ గేట్ల తొలగింపు పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. నరసాపురం వాసుల ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు బైపాస్ కల త్వరలోనే సాకారమవుతుందని, మొగల్తూరు, సీతారామపురం, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో భూములిచ్చిన 87 మందికి రూ.6.02 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలోనే నరసాపురం నుంచి చెన్నైకు వందే భారత్ రైలు ప్రారంభమవుతుందన్నారు. అలాగే అత్తిలి, వీరవాసరం లాంటి రైల్వే స్టేషన్‌లో విశాఖ, నాగర్ సోల్, సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నర్సాపురం పార్లమెంట్ పరిధిలో 42 ఆర్వోబీల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మంత్రి వర్మ చొరవతో రైతులకు పరిహారం చెల్లింపు జరగడం ఆనందంగా ఉందన్నారు. ఆరేళ్లగా పరిహారం కోసం ఎదురు చూస్తున్న నేషనల్ హైవేకి భూములిచ్చిన ఆకివీడు తదితర గ్రామాల రైతులు పరిహారం ఇప్పించడంతో మంత్రి వర్మను ఘనంగా సత్కరించారు. అనంతరం రైతులకు పరిహారం అందించడానికి సహకరించిన నేషనల్ హైవే ఈఈ సంజీవరాయుడు తోపాటు ఇతర అధికారులను వర్మ సత్కరించారు. ఆర్డిఓ కే. ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కార్డుదారులకు అసౌకర్యం కలిగిస్తే సహించను



సమీక్షిస్తున్న కమిషనర్ సౌరబ్ గౌర్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు అసౌకర్యం కలిగిస్తే సహించేది లేదని పౌర సరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్ సూచించారు. తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో రేషన్ పంపిణీపై తలెత్తే సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం. సునిల్‌కుమార్ సర్వర్ తొలిరోజు కొంత స్లోగా ఉండటం వల్ల వేగంగా రేషన్ పంపిణీ చేయలేక పోయారని తర్వాత బాగానే ఉందన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం మండలంలో ఉన్న 8011 వయోవృద్ధులు, దివ్యాంగులకు స్వయంగా రేషన్ అందించాలని కమిషనర్ సూచించారు. రేషన్ డిపోల వద్ద ఎండ లేకుండా మంచినీరు ఉండేలా చూసుకోవాలన్నారు. డిపోల వద్ద డీలర్ సమాచారంతో పాటు జిల్లా అధికారుల ఫోన్ నంబర్లు ఉండేలా క్యూ ఆర్‌కోడ్ బోర్డుల ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ బానో, డీఎస్‌వో పాల్గొన్నారు.

6న మురళీకృష్ణ ప్రమాణ స్వీకారం

ఏలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా ఇటీవల నియమితులైన జనసేన నాయకుడు, వ్యాపారవేత్త చాగంటి మురళీకృష్ణ ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు డీసీఎంఎస్ కార్యాలయం వద్ద కన్వెన్షన్ హాల్లో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు డీసీవో, ఇతర అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సాపురం లక్ష్మణేశ్వరానికి చెందిన మురళీకృష్ణను ఇటీవలే డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడిన విషయం తెల్సిందే.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో వివేక వర్మ ప్రతిభ



పెనుమంట్ర, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నెలమూరు గ్రామానికి చెందిన పాతపాటి వెంకట వివేకవర్మ జేఈఈ అడ్వాన్స్ ప్రవేశ పరీక్షలో ఓపెన్‌లో 1503 ర్యాంక్, కేటగిరిలో 132వ ర్యాంక్ సాధించి పలువురి ప్రశంసలు పొందినట్టు అతని తండ్రి శ్రీనివాసరాజు తెలిపారు. ఇంటర్మీడియట్ రాజమండ్రిలోని ఒక ప్రైవేటు కళాశాలలో చదివాడని, ఇంటర్ ఎంపీసీలో 976 మార్కులు సాధించాడని, జేఈఈ అడ్వాన్స్ మెయిన్స్ లో కూడా 699 ర్యాంకు వచ్చిందని తెలిపారు. వర్మను పలువురు అభినందించారు.

అక్షత్‌కు 109వ ర్యాంకు



కుక్కునూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు గ్రామానికి చెందిన జక్కం సాయి అక్షత్ అనే విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌లో ఆల్ ఇండియా కేటగిరిలో 109వ ర్యాంకు సాధించాడు. విజయవాడలోని ఒక ప్రైవేటు కళాశాలలో అంతకు ముందు జేఈఈ మెయిన్స్ సైతం 99.93 శాతంతో తన ప్రతిభను చాటాడు. కాగా ఇప్పుడు అత్యుత్తమ ర్యాంకు సాధించినందుకు మండలంలో పలువురు అక్షత్‌ను అభినందించారు. తండ్రి జక్కం మురళీ వ్యవసాయదారుడు కాగా తల్లి జ్యోతి గృహిణి. అక్షత్ చిన్నతనం నుంచి చదువుల్లో మంచిప్రతిభ కనపరిచేవాడు.

వెబ్‌సైట్లలో వైద్య ఉద్యోగార్థుల మెరిట్ జాబితాలు

ఏలూరు అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ క్వాలిటీ అష్యూరెన్స్ ఆర్బీఎస్కే, డీఈఐసీ విభాగాల్లో జిల్లా సలహాదారు(క్వాలిటీ అష్యూరెన్స్), మెడికల్ ఆఫీసర్(డెంటల్), క్లినికల్ సైకాలజిస్టు, ఆడియోలజిస్టు కం స్పీచ్ థెరపిస్టు, స్టాఫ్‌నర్స్ పోస్టులు భర్తీ చేసేందుకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన అనంతరం అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ లిస్టులను పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల వెబ్‌సైట్లలో పొందుపర్చినట్టు ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఏలూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

జిల్లా మహిళల వన్డే జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కంబైన్డ్ వెస్ట్‌గోదావరి) ఆధ్వర్యంలో 15 ఏళ్లలోపు మహిళల వన్డే జట్టును ఎంపిక చేసినట్టు సంఘ సభ్యులు తెలిపారు. సెంట్రల్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లు ఈ నెల 9 నుంచి 12 వరకు మంగళగిరిలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన్డే పోటీలు జరుగుతాయని, ఎంపిక చేసిన జట్టు పాల్గొంటుందని తెలిపారు. పి. రిషికా కృష్ణన్ (కెప్టెన్), జి. ధాన్యశ్రీ (వైస్ కెప్టెన్), ఎ. రత్నగ్రేస్, ఎం. శ్రీలలిత, శివమాధురి, జి. నిత్యశ్రీ, ఎం. సంజన, డి. కేశవ వర్ధిని, పీఎస్డీ ప్రియ, ఎం. సౌజన్య, ఎస్. గీతామౌనిక, డీవీఎస్ చాందిని, ఎం. హేమలతాదేవి, ఎం. తేజశ్రీ ఎంపికయ్యారు. స్టాండ్ బైగా బి. గంగా దుర్గాభవాని, ఎన్. వైశాలి, బి. రిషిత, ఎస్. గీత, వై యక్షిత మణి ఎంపికయ్యారని ఇ. అశోక్‌కుమార్‌గౌడ్, ఎస్‌కె హుస్సేన్ తెలిపారు.

ఇసుక నిల్వలు



- వర్షాకాలంలో కొరత లేనట్టే
- నిల్వ చేసుకుంటున్న నిర్మాణదారులు
- స్టాక్ పాయింట్‌లలో నిల్వ చేస్తున్న ప్రభుత్వం
- ప్రస్తుతం ఆరు యూనిట్‌లు రూ. 9వేలు
- త్వరలోనే ఓపెన్ ర్యాంప్‌లు మూత

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వేసవిలో వర్షాలు కురిశాయి. ఇక వానాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది. వర్షాలు ప్రారంభమైతే ఇసుక కొరత రానుంది. ఓపెన్ ఇసుక ర్యాంప్‌లను మూసి వేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ముందుగానే ఇసుక నిల్వలు సిద్ధం చేయడంతో కొరతను అధిగమించవచ్చు. జిల్లాకు తూర్పు గోదావరి పరిధిలోని తీపర్రు. పందలపర్రు ర్యాంప్‌లను కేటాయిం చారు. ఔరంగా బాద్ రీచ్‌ను కేటాయించారు. అక్కడ గోదావరిలో ఇసుకను తవ్వి ఒడ్డుకు చేరుస్తున్నారు. వానాకాలంలో ఔరంగా బాద్ నుంచే ఇసుక సరఫరా అవుతుంది. నాలుగు నెలలపాటు మూడు నెలలపాటు ర్యాంప్‌లు మూతపడనున్నాయి. దాంతో నిర్మాణదారులు ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తున్నారు. ఇసుక ధరలు పెరిగిపోనున్నాయని అంచనా వేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ప్రాజెక్ట్‌ల కోసం ముందుగానే నిల్వలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రూ. 9వేలకే ఆరు యూనిట్‌ల ఇసుక లభ్యమవుతోంది. గత ప్రభుత్వంలో ఐదు యూనిట్‌లు రూ. 14వేలకు విక్రయించారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చారు. సీనరేజీ, జీఎస్‌టీ ఎత్తివేశారు. ర్యాంప్‌ల వద్ద అదనంగా కాస్త సొమ్ములు వసూలు చేస్తున్నా సరే ఆ మొత్తానికి అదనంగా ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఫలితంగా నిర్మాణదారులకు ఇసుక లభ్యత సునాయసమైంది. ఉచిత ఫలితం చూస్తున్నామంటూ నిర్మాణదారులు చెప్పుకొనే పరిస్థితి నెలకొంది. వానా కాలంలో ఇసుక లభ్యత తగ్గుతుంది. వరదల సమయంలో గోదావరిలో ఇసుక తవ్వకాలు నిలచిపోనున్నాయి. వానా కాలంలో గోదావరి ప్రవాహం సాధారణంగా ఉన్నప్పుడే నీటిలో ఇసుకను వెలికి తీసి ఒడ్డుకు చేరుస్తారు. అదికూడా రెండు రీచ్‌ల్లోనూ అధికమొత్తంలో తవ్వకాలు ఉంటాయి. మిగిలిన ర్యాంప్‌లు, రీచ్ లు మూతపడతాయి. దాంతో ఇసుక సరఫరా గణనీయంగా తగ్గిపోతుంది. దాంతో డిమాండ్ ఏర్పడుతుంది. ధరలు పెరగ నున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్మాణదారులు ముందస్తుగా నిల్వ చేసుకుంటున్నారు. మూడు నెలలకు సరిపడా ఇసుక భద్ర పరుస్తున్నారు.

స్టాక్ పాయింట్‌లలో నిల్వ

వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా జిల్లా అధికారులు చర్య లు తీసుకున్నారు. స్టాక్ పాయింట్‌లలో ఇసుక నిల్వ చేస్తున్నారు. ఇప్పటికే కాంట్రాక్టర్లను ఖరారు చేశారు. తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, ఉండి, నరసాపురం పరిధిలో స్టాక్ పాయిం ట్‌లను గుర్తించారు. నిల్వ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటిదాకా విరివిగా ఇసుక లభ్యమైంది. డిమాండ్ లేనట్టయితే నష్టాలు చవిచూస్తామని కాంట్రాక్టర్లు స్టాక్ పాయింట్‌లలో నిల్వకు ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం స్టాక్ పాయింట్‌ల వద్ద ధరను నిర్ణయించనుంది. ఆ మేరకు కాంట్రాక్టర్లు ఇసుక సరఫరా చేయాలి. ధర ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో నిర్మాణదారులు తమ సొంత స్థలాల్లో నిల్వ చేసుకుంటున్నారు.

మైప ఎత్తిపోతలు.. మూలనపడింది



శిథిలమైన నీటి నిల్వ ట్యాంక్, ఇంజన్లతో నీరు తోడుకుంటున్న రైతులు

- రూ. 14.70 కోట్ల నిధులు వృథా
- నిర్మించిన రెండేళ్లకే మూలనపడిన ఎత్తిపోతల పథకం
- తప్పని సాగు నీటి కష్టాలు

పాలకోడేరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దాహార్తి తీర్చేది.. పంటలు ఇచ్చేది నీరే. రైతులకు నీరందిం చేందుకు రూ.14.7 కోట్లతో నీటిపారుదల సంస్థ ద్వారా నిర్మించిన మైప ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా పడి ఉంది. సుమారు ఆరు గ్రామాల్లో 3,100 ఎకరాలకు సాగు నీరందిం చేందుకు 2013లో అప్పటి టీటీడీ చైర్మన్ కనుమూరి బాపిరాజు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పథకాన్ని పూర్తిచేసి వాడుకలోకి తీసుకువచ్చారు. పాలకోడేరు మండలం మైప, కోరుకొల్లు, గరగపర్రుతో పాటు యండగండి, అత్తిలి మండలంలోని స్కిన్నెరపురం, ఈడూరు గ్రామాలకు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరు అందించడం లక్ష్యం. ఈ పథకం రైతులకు అంతంత మాత్రం ఉపయోగపడింది. తర్వాత రెండేళ్లకే ఎందుకూ పనికిరాకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యండగండి గ్రామం సమీపాన యనమదుర్రు డ్రెయిన్ నుంచి యండగండి, మైప, కోరుకొల్లు, స్కిన్నెరపురం, ఈడూరు వరకు సుమారు 7.5 కిలోమీటర్లు పంట పొలాల్లో నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ ద్వారా పాలకోడేరు, అత్తిలి మండలాల్లో శివారు ప్రాంతాలకు సాగునీరు అందించేలా ఏర్పాట్లు చేశారు.

ఉప్పునీటితో ఇబ్బందులు

రూ. 14.7 కోట్లతో ఏర్పాటుచేసిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా యనమదుర్రు డ్రెయిన్ నుంచి మూడు భారీ మోటార్లతో సాగునీరును తోడుతూ ఉండేవారు. యనమదుర్రులో ఉప్పునీరు రావడంతో తమ పంట పొలాలు నాశనమవుతున్నాయని అప్పట్లోనే రైతులు గగ్గోలు పెట్టారు. కొంత కాలం ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు తోడినా రైతులకు అంతంత మాత్రంగానే ప్రయోజనం రావడంతో ఆసక్తి కనబర్చలేదు. కొన్ని రోజులకు ఇంజన్లు పాడవడంతోపాటు పైప్‌లైన్‌లో మరమ్మతులు చేయకపోవడం, మెయింటెనెన్స్ లేకపోవడం, స్టార్టర్స్ పాడవడంతో ఆ పథకం మూలనపడింది.

నిర్మించారు... పట్టించుకోలేదు

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ పథకాన్ని త్వరితగతిన ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ గాలి కొదిలేశారు. ఇరిగేషన్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో కోట్ల రూపా యలతో నిర్మించిన పథకం వృథాగా పడి ఉంది. దీనికి తోడు వైసీపీ ప్రభుత్వ హయాంలో పంట కాలువలను తవ్వకపోవడం, వాటిపై శ్రద్ధ చూపకపోవడంతో రైతులకు సాగునీరందక నేటికీ నానా పాట్లు పడుతూనే ఉన్నారు. ఓవైపు కోట్లాది రూపాయలతో నిర్మించిన ఎత్తిపోతల పథకం మూలనపడగా, సాగు నీరందించే పంట కాలువలు సైతం పూడుకుపోవడంతో ఆయా ప్రాంత రైతులు సాగునీటి కోసం అల్లల్లాడుతున్నారు. మూలనపడిన ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం దృష్టి పెట్టి ఆ పథకానికి మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు పుష్కలంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిర్వహణ లేదు



ఇరిగేషన్ నిధులు రూ. 14.7 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించారు. నిర్వహణ గాలికొదిలేయడంతో ఎందుకూ పనికిరాకుండా పోయింది. నిర్మించిన రెండేళ్లకే మూలనపడడం విచారకరం. రైతులకు ప్రయోజనం చేకూర్చాలని నిర్మించారు కాని, దానిని ఆచరణలో పెట్టడంలో మాత్రం మరిచారు. దీంతో రైతులమంతా చాలా ఇబ్బందులు పడ్డాం.

గాదిరాజు శ్రీనివాసరాజు, కోరుకొల్లు

మరమ్మతులు చేయలేదు




ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించేందుకు చాలాకాలం నేనే మోటార్లను ఆపరేట్ చేశా. ఇంజన్లు, స్టార్టర్స్ పాడవడంతో వాటిని మరమ్మతులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇక వదిలేశాం. కాలువల ద్వారా వచ్చే నీటినే ఇంజిన్లు, కారెముల ద్వారా తోడుకుని పంటను సాగు చేసుకున్నాం. ఈ పథకాన్ని వాడుకలోకి తీసుకువస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

కర్తాక ఏసురాజు

పదోన్నతులు, బదిలీల్లో న్యాయం చేయాలి

ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) ఉద్యోగుల ధర్నా



ప్రదర్శనలో పాల్గొన్న ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) ఉద్యోగులు

ఏలూరు అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం జగన్ ప్రభుత్వ అకస్మాత్తునిర్ణయంతో సుదూర ప్రాంతాలకు పని సర్దుబాటు పేరిట తరలించిన తమకు న్యా యం చేయాలని ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) ఉద్యోగులు డి మాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏలూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో అన్యాయంగా బదిలీ అయిన 114మంది ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) ఉద్యోగులంతా ప్రస్తుత సాధారణ బదిలీల్లో వారివారి పూర్వపు స్థానాల్లో విధులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రగతిశీల మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ ఫిమేల్ అసోసియేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షులు కె.శిశేల్యమ్మ, కార్యదర్శి యు.ప్రమీల డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లుగా ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్)ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు లేవని, తాజాగా చేపట్టనున్న ప్రమోషన్లలో 30ఏళ్ల పాటు సర్వీసు ఉండి, వయస్సు 50-58 సంవత్సరాల మధ్య ఉన్నామని వివరించారు. గత మూడేళ్లుగా వర్క్‌అడ్జెస్ట్‌మెంట్ కారణంగా తాము బదిలీలకు, కుటుంబాలకు కూడా దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు జరుగుతున్న సాధారణ బదిలీల్లో తమనుకూడా పదోన్నతులకు, బదిలీలకు పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈమేరకు డీఎంహెచ్‌వో మాలినికి వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఉన్నతాధికారులకు కూడా వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు ఆగ్నేశమ్మ, ఎన్.రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ఆకివీడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్నేహితుడికి దుబాయ్ సూపర్ మార్కెట్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసగించిన వ్యక్తిపై ఆకివీడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మందపాడు గ్రామానికి చెందిన గండికోట వెంకటేష్‌ను తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన మండలం పెనుమాల గ్రామానికి చెందిన బడుగు రాంబాబు అనే వ్యక్తి దుబాయ్ సూపర్ మార్కెట్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దపదఫాలుగా రూ.4.60 లక్షలు ఇవ్వగా ఆ డబ్బు రాంబాబు కాజేశాడు. అయితే చెప్పిన ఉద్యోగం చూపించకపోవడంతో వెంకటేశ్ పోలీసులను ఆశ్రయించాడు.. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో చైన్ స్నాచింగ్‌లు

మొన్న వై.ఎస్.పాలెం.. నేడు వెంప

నరసాపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నరసాపురం రూరల్ పోలీస్ పరిధిలోని వెంపలో చైన్ స్నాచింగ్ కేసు నమోదైంది. శనివారం రాత్రి వరలక్ష్మి భర్త వెంకటేశ్వరరావుతో కలిసి కుమార్తె ఇంటికివెళ్లింది. తిరిగి బైక్ పై వస్తుండగా వీరి వాహనాన్ని మరో బైక్ అనుసరించింది. పెద్ద గురువు వద్ద ఏదో వాహనం అనుకున్నారు, క్షణంలోనే దగ్గరకు దూసుకొచ్చి వరలక్ష్మి మెడలోని నాలుగు కాసుల మంగళ సూత్రాన్ని తెంపుకుని ఉడాయించాడు.వరలక్ష్మి తెరుకుని కేకలు వేయగా భర్త బైక్‌ను అపేలోపు దుండగుడు దూసుకుపోయాడు. తెరుకున్న భార్యభర్తలు నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్సై వెంకట సురేశ్ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే వారం రోజుల్లో ఇది రెండో చైన్ స్నాచింగ్, నరసాపురం మండలం వైఎస్‌పాలెంలో భర్తతో కలిసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన దుండగుడు ఆమె మెడలో మూడు కాసుల బంగారు గోలుసును తెచ్చుకుని ఉడాయించాడు. రెప్పపాటులో జరిగిన ఈ ఘటనతో బాధితురాలు కేకలు వేస్తుండగానే... బైక్‌పై ఉడాయించాడు. ఇదే తరహాలో భీమవరం మండలం వెంపలో మరో సంఘటన జరగడంతో తీరంలో సంచనలమైంది. మహిళలు రోడ్డు మీదకు బంగారు ఆభరణాలు వేసుకుని రావడానికి హడలిపోతున్నారు.

తల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కన్నతల్లిని ఆమె కట్టుకున్న చీరతోనే మెడకు చుట్టి హత్య చేసిన కుమారుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని రెండవ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కృష్ణా జిల్లా విస్సన్నపేట మండలం తాటికుంట నరసాపురం గ్రామానికి చెందిన జూట్రూ మారేష అతని భార్య లక్ష్మీలు కొంతకాలంగా ఏలూరులో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడైన జూట్రు నాగతిరుపతిరావు(22) మద్యానికి బానిసయ్యాడు. 2021 సంవత్సరంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తల్లి లక్ష్మిని నాగతిరుపతిరావు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఆమె కట్టుకున్న చీరతోనే ఆమె మెడకు చుట్టి హతమార్చాడు. ఈ సంఘటపై లక్ష్మీ భర్త మారేష చింతలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ కె.సి.హెచ్.స్వామి కేసు నమోదు చేయగా అప్పటి చింతలపూడి సీఐ అయిన ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎంవిఎస్ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు రెండవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. హంతకుడైన నాగ తిరుపతి రావుపై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని రెండవ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ ఎం.నాగేశ్వరరావు, చింతలపూడి సీఐ సి.హెచ్.రాజశేఖర్, చింతలపూడి ఎస్‌ఐ కె.కుటుంబరావు, హెడ్‌కానిస్టేబుల్ ఎం రాజేశ్‌లు సహకరించారు. హంతకుడికి శిక్ష పడటంలో ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులను ఎస్పీ కిశోర్ అభినందించారు.

కుక్కలను చంపినవారిపై కేసు

ఏలూరు క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఫారమ్ వద్ద కుక్కలు కోళ్లను తింటున్నాయనే కారణంతో ఇద్దరు వ్యక్తులను తీసుకొచ్చి 9 కుక్కలను హతమార్చిన సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడకు చెందిన సూరాబత్తుల గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. ఈ నెల 27న సాయంత్రం 4.30 గంటలకు శనివారంపుపేట ఏటిగట్టు శివారు ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి తుపాకీతో ఆ ప్రాంతంలో ఉన్న 9కుక్కలను హతమార్చి వెళ్లిపోయారు. అంతేకాకుండా ప్రశ్నించిన కుక్కల యజమానులను బెదిరించారు. ఈ సంఘటనను 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక మే నెల 30న వెలుగులోకి తీసుకొచ్చింది.దీంతో పోలీస్ అధికారులు నిఘా పెట్టారు. కాకినాడకు చెందిన జంతు సంరక్షణ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి సూరాబత్తుల గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండ్రోజుల్లో నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. ఇప్పటికే నిందితులను గుర్తించినట్లు సమాచారం.

వాట్సాప్ మెస్సేజ్‌లతో హెచ్‌ఎంకు వేధింపులు

● సైబర్ క్రైం కేసు నమోదు.. అదే పాఠశాలలోని హిందీ టీచర్‌గా గుర్తించి అరెస్టు

ఏలూరు క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై కక్షగట్టిన అదే పాఠశాలలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయిని అసత్య ప్రచారాలు చేస్తూ వేధింపులకు గురిచేశారు. వాట్సాప్‌లో మెస్సేజ్‌లు పెట్టి అల్లరిపాలు చేశారు. దీంతో బాధితురాలు తనకు న్యాయం చేయాలంటూ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేశారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి జడ్పీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా బాధితురాలు పని చేస్తున్నారు. ఆమె సెలవులు ఇవ్వకపోవడం, పాఠశాల సమయంలో సెల్‌ఫోన్లను ఉపయోగించవద్దని చెప్పడం, క్రమశిక్షణ అమలు చేయడంతో అదే పాఠశాలలో పనిచేస్తున్న హిందీ టీచర్ శ్రీవల్లి కక్ష పెంచుకున్నారు. ఎలాగైనా ప్రధానోపాధ్యాయురాలిని అల్లరి చేయాలని ఆ పనిని గోప్యంగా చేపట్టారు. తన పనిమనిషి పేరిట ఓ సిమ్‌ను తీసుకుని అందులో నుంచి బాధితురాలి బంధువులకు, కుటుంబ సభ్యులకు, పాఠశాలలో పనిచేస్తున్న మిగిలిన ఉపాధ్యాయులకు లేనిపోని మెస్సేజ్‌లు పెట్టారు. బాధితురాలికి వేరే ఓ కానిస్టేబుల్‌తో సంబంధం ఉందని, చెడు తిరుగుళ్లు తిరుగుతారని ఇలా అసభ్యంగా మెస్సేజ్‌లు పెట్టారు. దీంతో బాధితురాలు ఏలూరు సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మహిళా పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు కేసు నమోదు చేసి మెస్సేజ్‌లు పెట్టే ఈ అపరిచిత వ్యక్తి ఎవరు అని తెలుసుకునేందుకు పాఠశాలకు వెళ్ళి అనేక కోణాల్లో విచారణ చేశారు. చివరకు హిందీ టీచరే ఈ మెసేజ్‌లు పెడుతున్నట్టు తెలుసుకుని ఆమెపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. దీంతో పాటు సంబంధిత టీచర్ శ్రీవల్లిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా డీఈవోకు సిఫార్స్‌లేఖ పంపించినట్టు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.ఆమెకు కొంత మంది సహకరించినట్లు తెలిసిందని వారిపై కూడా చర్యలుంటాయన్నారు.

గేదె అపహరణపై ఫిర్యాదు

ఇరగవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : పాకలో కట్టిన గేదె అపహరణకు గురైందంటూ ఇరగవరం గ్రామానికి చెందిన రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామ శివారు గుబ్బలవారిపాలెం గ్రామానికి చెందిన రైతు వేండ్ర నర్సయ్య పొలం పని చేసుకుంటూ గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 26న పాకలో కట్టిన సూడి గేదె మరుసటి రోజు చూసే సరికి లేదని చుట్టు పక్కలా వెతికినా కనిపించలేదని, దొంగలే అపహరించుకుపోయారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష రూపాయల విలువైన 4 నెలల సూడి గేదెను ఎత్తుకెళ్లడంతో గేదెలను మేపడానికి భయం వేస్తుందంటూ కన్నీరుమున్నీరయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై ఇరగవరం ఎస్‌ఐ జానా సతీష్‌ను వివరణ కోరగా గేదె అపహరణకు గురైన విషయం తమ దృష్టికి వచ్చిందని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

డబ్బులు తీయమని కార్డు ఇస్తే..

సొమ్ము కాజేశాడు

ఆకివీడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): డబ్బులు తీసి ఇవ్వమని ఏటీఎం కార్డు ఇస్తే తిరిగి నకిలీ కార్డు ఇచ్చి మోసం చేశాడంటూ ఓ వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు. ఆకివీడుకు చెందిన పాపోలు శశిధర్ తిలక్ దేవదాయ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఈ ఏడాది జనవరిలో పింఛను డబ్బులు తీసుకునేందుకు ఏటీఎంకు వెళ్ళి అక్కడున్న ఓ వ్యక్తికి ఏటీఎం కార్డు ఇచ్చాడు.. డబ్బులు తీసి ఇవ్వమని కోరడంతో చెప్పింది చేశాడు.. అయితే అనంతరం దఫదఫాలుగా రూ.48 వేలు బ్యాంకు ఖాతా నుంచి స్వాహా అయినట్టు తిలక్ గమనించి ఏటీఎం కార్డు పరిశీలించగా నకిలీ కార్డు అని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హనుమంతునాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



లింగపాలెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మండలంలో కల కలం రేపింది. కె.గోకవరం శివారులో ఉన్న జామాయిల్ తోటలో పశువుల కాపరులకు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు గ్రామ రెవెన్యూ అధికారికి సమచారం అందించడంతో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చనిపోయిన వ్యక్తికి సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే(94407 96677, 94407 96674) సమాచారం అందించాలన్నారు.

బోధనా మెలకువలపై సదస్సు

ఏలూరు అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేటర్స్ ఎన్‌రిచ్‌మెంట్ కాంక్లేవ్-2025 ప్రోగ్రాంను సోమవారం ఏలూరు సిద్ధార్థ స్కూల్లో డీవైఈవో రవీంద్రభారతి ప్రారంభించారు. శుభకరమైన జీవనవిధాన సూత్రాలు, ధ్యానం-ఆవశ్యకత అంశాలు, ఆంగ్లభాషలో బోధనామెళకువలపై వివరించారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కోనేరు సురేష్‌బాబు, రవీంద్రకుమార్ రెడ్డి, సుమారు 150మంది టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

5న విజయవాడలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

ఏలూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో 5న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్ కుమార్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం సభ్యులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు.

సీసీటీవీ కెమెరా సెక్యూరిటీ అలారంపై ఉచిత శిక్షణ

పెదపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణను ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని శిక్షణ సంస్థ తెలిపింది. 10వ తరగతి ఆపైన విద్యార్హత కలిగిన 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలం 13 రోజులు ఉంటుందని, శిక్షణాకాలంలో ఉచిత భోజనం, వసతి ఉచితమన్నారు. మరిన్ని వివరాలకు వట్లూరులోని టీటీడీసీ పక్కన కార్యాలయాన్ని(95027 23561, 90140 40780) సంప్రదించాలన్నారు.

నూరు శాతం హాస్టళ్లలో అడ్మిషన్‌లు జరగాలి

చింతలపూడి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ చింతలపూడి సబ్‌డివిజన్‌లోని నాలుగు మండలాల్లో ఉన్న హాస్టళ్లల్లో 2025-26కుగాను నూరు శాతం అడ్మిషన్లు జరగాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎం.ముక్కంటి అన్నారు. స్థానిక సహాయ సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని వెల్ఫేర్ ఆఫీసర్లు, సహాయకులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం హాస్టళ్ళ భవనాలు మరమ్మతులు జరుగుతున్నాయని,వాటిని వేగవంతం చేసి పూర్తి చేయించాలని ఆదేశించారు. అంతకుముందు పలు హాస్టళ్ళ మరమ్మతుల పనితీరును పరిశీలించారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యువో జి.మంగారత్నం, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం పరిధిలోని హాస్టల్ వార్డెన్‌లు, సహాయకులు పాల్గొన్నారు.

పట్టిసీమ శివక్షేత్రానికి భక్తుల తాకిడి



పోలవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి పట్టిసీమ శివక్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో అర్చక బ్రాహ్మణులు స్వామికి బిల్వార్చన, భస్మార్చన, పంచామృత అభిషేకాలు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తులకు పులిహోర ప్రసాదాలు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టిసీమ దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న క్షేత్రపాలకుడు భావన్నారాయణస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి, సీతారామ చంద్ర స్వామి, భద్రకాళీ, విజయగణపతి పూజలు నిర్వహించారు.



హెచ్ఎం విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎంలకు అభినందన

దెందులూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నాలుగు ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు బదిలీపై వచ్చారు. దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలకు రాచూరు పాఠశాల నుంచి వడ్లపట్ల విజయ్ కుమార్ బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన మల్లికార్జునరావు పెదనింద్రకొలను బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు హెచ్ఎం వడ్లపట్ల విజయ్ కుమార్‌కు బొకేను అందించి శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. మేదినరావుపాలెం ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా పి.సురేశ్ పంగిడిగూడెం ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. పోతునూరు ఉన్నత పాఠశాలకు ఎ.జయశంకర్ ప్రకాశ్ గోపన్నపాలెం ఉన్నత పాఠశాల నుంచి పదోన్నతిపై వచ్చారు. చల్లచింతలపూడి ఉన్నత పాఠశాలకు వి.వి.ఎన్. మల్లేశ్వరి వీరంపాలెం ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు.

కె.ఎస్.జవహర్‌కు దళితనేతల అభినందనలు



జవహర్‌ను కలిసిన నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ను పలువురు అభినందించారు. సోమవారం దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాశ్ ఆధ్వర్యంలో దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్ల మోడీ వెంకటరావు, దళిత సేన పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు చీలి మోహనరావు మర్యాద పూర్వకంగా కలిసి సాలువా కప్పి అభినందించారు. రవి ప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీలపై జరుగుతున్న దాడులను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా చేయాలని విజ్ఞప్తి చేశారు.

కొయ్యలగూడెం, కన్నాపురం రోడ్డుకి మార్కింగ్



మార్క్ వేస్తున్న అధికారులు

కొయ్యలగూడెం, జూన్2(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం, కన్నాపురం రహదారిలో ఆక్రమణలు తొలగించడానికి అధికారులు మార్కింగ్ చేపట్టారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. ఎఫ్‌ఎంబీ ప్రకారం ఆర్‌అండ్‌బీ స్థలం ఎంత మేర ఉందో ఆ మేరకు మార్కింగ్ ఇస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ రహదారిలో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని జిల్లా ఉన్నతాధికారులకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించి ఆక్రమణలకు మార్కింగ్ చేశారు. మండల సర్వేయర్ బ్రహ్మదేవుడు, వీఆర్వో భట్టు వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఏలూరు అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు విద్యా సంస్థలు, వసతి గృహాలను మూసివేయించేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులకు వినతిపత్రాన్ని అందజేసినట్టు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని తెలిపారు. ఏలూరు, పరిసర ప్రాంతాల్లో ఇంకా భవన నిర్మాణాలు పూర్తికాకుండానే పెద్దయెత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. వీటికి సకాలంలో ప్రభుత్వ అనుమతులు రానట్టయితే వాటిలో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల పరిస్థితేంటని ప్రశ్నించారు. వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లలో భద్రతపై అధికారులు తనిఖీలుచేసి తదుపరి చర్యలు చేపట్టాలని సంఘ నాయకులు సాయి, తదితరులు డిమాండ్ చేశారు.

పాత విధానంలో రేషన్ ఇవ్వడం అభినందనీయం

జంగారెడ్డిగూడెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాత విధానంలోనే సరుకులు ఇచ్చేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమని టీడీపీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, సీనియర్ టీడీపీ నాయకుడు పరిమి సత్తిపండు అన్నారు. సోమవారం స్థానిక రామచంద్రాపురంలోని 39వ రేషన్ దుకాణం వద్ద కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రేషన్ వాహనాలు ఎప్పుడొస్తాయో తెలీక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. 15 రోజుల పాటు రేషన్ దుకాణం వద్ద ప్రజలు తమ వెసులుబాటు ప్రకారం సరుకులు పొందవచ్చన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, గెడా సుబ్రహ్మణ్యం, పాకనాటి అంజిబాబు, గణేష్, డీలర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎప్పుడిస్తారు!

(ఒకటో పేజీ తరువాయి)

చొప్పున చెల్లించడానికి సిద్ధం అయ్యింది. ఈ నెల 12న పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం అయ్యే తేదీ దగ్గర పడింది. ఆ లోపే తల్లికి వందనం కింద సొమ్ములను జమచేస్తారా లేదా అన్నది అందరిని పట్టి పీడిస్తున్న ప్రశ్న. గతంలో కేవలం ఒక్క పిల్లాడికే రూ.13 వేలు చొప్పున చెల్లిస్తే జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లలో రూ.1,069 కోట్లు ఈ ఒక్క జిల్లాలోనే ప్రభుత్వానికి భారమైంది. ఇప్పుడు గతం కంటే విద్యార్థుల సంఖ్య రెట్టింపు ఉంటుందా లేదా నాలుగు లక్షలు దాటబోతుందనేది టెన్షన్ పెడుతోంది. ఒకటికి రెండు సార్లు దరఖాస్తులను వడపోస్తున్నారు.ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ ప్రాంతానికి వస్తే ఆ రెండింటి సొమ్ములు ఎప్పుడు ఖాతాలో వేస్తారంటూ జనం ప్రశ్నలు సంధిస్తున్నారు. కీలక సమయంలో సర్కారు సొమ్ములు కాస్తోకూస్తో జమ అయితే గట్టెక్కుతామనే భావనలో అంతా ఉన్నారు.



ఏలూరులో యోగా చేస్తున్న ఆవులయ్య



కొయ్యలగూడెంలో యోగా చేస్తున్న అధికారులు



యోగాసనాలు వేస్తున్న లింగపాలెం అధికారులు

యోగా సాధనతో మానసిక ప్రశాంతత

ఏలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. వట్లూరు టీటీడీసీలో యోగాంధ్ర కార్యక్రమంలో సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల్లో మానసిక ప్రశాంతతకు యోగా ఉపయోగపడుతుందని, ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లాలోని 50 మంది యోగాభ్యాసనలో పాల్గొన్నారు.

● భీమడోలు : యోగాంధ్రలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. యోగాంధ్ర ట్రైనీ మాస్టర్ సత్యేంద్ర విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ప్రతి ఆసనం ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సూర్య నమస్కారాలు చేయించారు. భీమడోలు శాఖా గ్రంథాలయానికి చెందిన విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ కె.తనూజ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పెద్దలు పైడిమాల యుగంధర్, ఈతకోట సత్యకృష్ణ, గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : యోగాంధ్ర శిక్షణకు భారీ స్పందన వస్తోందని ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద యోగాంధ్ర శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి నుంచి 6వ తేదీ వరకు మండల స్థాయిలో యోగాపై వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సోమవారం సూర్య నమస్కారాలు, ప్రాణమయం, మెడిటేషన్ వంటి పోటీలు నిర్వహించామన్నారు. యోగాభ్యాసన కార్యక్రమంలో భాగంగా మండలంలో ఇప్పటి వరకు 24,598 మందిని నమోదు చేశామన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేశ్ బాబు పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందుతుందని ఎంపీడీవో కందుల వాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేలా వారికి యోగాలో శిక్షణనిచ్చారు. మండలంలో ప్రతి ఒక్కరూ యోగా చేసేలా కృషి చేస్తున్నామన్నారు.తహసీల్దార్ ప్రసాద్, ఎంఈవో రామారావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది యోగా సాధనలో పాల్గొన్నారు.

జూలై 31 నాటికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రారంభం : కలెక్టర్

ఏలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీడీపీని పెంచేలా, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను జూలై 31వ తేదీకి ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఫుడ్‌ప్రాసెసింగ్ ఔత్సాహికులు, రైతులతో కలెక్టరేట్‌లో వెట్రిసెల్వి,చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌లు సంయుక్తంగా సోమవారం సమావేశం నిర్వహించారు.వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం వలన జిల్లా జీడీపీని పెంచేలా అధికారులు చర్యలు ఉండాలన్నారు.జిల్లాలో కోకో, మామిడి,ఆక్వా తదితర ఉత్పత్తులకు జిల్లాలో 100 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించగా, మొదటి విడతలో 70 యూనిట్లు గుర్తించామన్నారు. ఈ నెల 4వ తేదీ నాటికి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, 10వ తేదీలోగా శాఖాపరంగా అందర్నీ సమావేశ పరిచి అప్లికేషన్లు, ప్రాజెక్టు రిపోర్టు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. తన నియోజకవర్గంలో ఈ యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చిన వారికి భూమిని కేటాయించి, అన్ని విధాలా సహకరిస్తామన్నారు.వర్క్‌షాప్‌లు నిర్వహించి కోకో, ఇతర పంటలకు నాణ్యతా ప్రమాణాలను పెంచేలా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎఫ్‌పీఎస్ జోనల్ మేనేజర్ మారుతి, ఉద్యానశాఖ డీడీ ఎస్ రామ్మోహన్, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు,లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ డి.నీలాద్రి,కోకో కన్సల్టెంట్ నితిన్ చౌడియా, డీఆర్వో పి.హిమవాణి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

ఏజెన్సీలో అక్రమ కట్టడాలు తొలగించండి

బుట్టాయగూడెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని కోరుతూ ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు వినతిపత్రం అందజేసింది. సోమవారం బుట్టాయగూడెం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొడియం శ్రీనివాసరావు, సోదెం ముక్కయ్య, రవ్వా బసవరాజు, కుంజా వెంకటేశ్వరావు, ఉయికె బుజ్జి, పట్ల రమేశ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లో 204 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో 204 అర్జీలు స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, డీఎల్డీవో ఎ.బి.పి.వి.లక్ష్మి, కలెక్టరేట్ ఏవో ఎన్.వి.నాంచారయ్యలు ప్రజల నుంచి ఈ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలు సత్వర పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదే ఫిర్యాదు మళ్లీ రాకుండా శాశ్వత పరిష్కారాన్ని చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు సూచించారు. పీజీఆర్‌ఎస్ ద్వారా 204 అర్జీలు అందాయి.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎం.వి. రమణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గిట్టుబాటు ధర రూ.450 కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ, తగరం బాబూరావు, రైతులు కొమరం బాబూరావు, కె.నాగేశ్వరరావు, శ్యాంబాబు, ఇ.భూషణం పాల్గొన్నారు.



టి.నర్సాపురం : బొర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001 సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమా వేశం సోమవారం నిర్వహించారు. వివిధ వృత్తుల్లో స్థిరపడిన సుమారు 120 మంది పాల్గొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

నాగిరెడ్డిగూడేన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

చింతలపూడి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడేన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. సారా తయారీ వలన ఆరోగ్యం క్షీణిస్తుందని, దానివలన కుటుంబం కూడా పతనమ వుతుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.వి.ఎన్. ప్రభుకుమార్, సూపరింటెండెంట్ ఆవులయ్య, పాండు రంగారావు, అజయ్‌కుమార్‌సింగ్, సీఐలు ధనరాజ్, అశోక్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవిశిక్షణ తరగతులు

ఏలూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 30వ రోజు వినోదాత్మకంగా నిర్వహించినట్టు డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు సోమవారం తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి సందీప్‌కుమార్, ఎమ్‌డి అస్లాంపాషా, ఎమ్ కనకదుర్గ పాల్గొన్నారు.

● పెదపాడు : శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు అభయ అరణ్యం, అడవుల వల్ల ఉపయోగాలు గురించి రిసోర్స్ పర్సన్ వేమిరెడ్డి నాగేంద్ర తెలియజేశారు. భారత దేశంలో ఉన్న వన్యమృగాలు, అడవులు, కొండ ప్రాంతాలు, ఎడారులు వంటి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు ఆర్.కిశోర్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తకపఠనం అలవర్చుకోవాలన్నారు.

●లింగపాలెం : ధర్మాజీగూడెం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సి.హెచ్.వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులతో చెస్, క్యారమ్స్, ఖోఖో, లాంటి ఆటలు నేర్పిస్తున్నామన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

చింతలపూడి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని జిల్లాను మలేరియా రహిత జిల్లాగా తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ వలన దోమలు వ్యాపిస్తాయని ఇందుకు లార్విసైజ్ మందులను స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆర్.మాలిని, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.ఎ. ప్రసాద్, స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామయ్యపాలెంలో గంగానమ్మకు పూజలు

జీలుగుమిల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామం సుభిక్షంగా ఉండాలని పాడి పంటలు వృద్ధి చెందాలని గంగానమ్మకు రెండ్రోజుల పాటు కామయ్యపాలెం గ్రామస్థులు విశేష పూజలు చేశారు. ఆది సోమ వారాలు గ్రామ ఇలవేల్పును దూర ప్రాంతం నుంచి వచ్చిన ఆడపడుచులు దర్శించుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

సీపీఐ సభలను జయప్రదం చేయండి

బుట్టాయగూడెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ తెలిపారు. బుట్టాయగూడెంలో చోడెం దుర్గ అధ్యక్షతన 14వ సీపీఐ మండల మహాసభను సోమవారం నిర్వహించారు. భవిష్యత్ పోరాటాలను రూపొందించుకోవడం కోసం జూలై 5,6,7 తేదీల్లో చింతలపూడిలో జిల్లా సభలు జరుగుతాయన్నారు. వీటిని జయప్రదం చేయడానికి నాయకులు కృషి చేయాలన్నారు. నాయకులు మన్నవ కృష్ణ చైతన్య, కె.ధారయ్య, టి.అంజనేయరాజు, చోడెం దుర్గ, బి.కిశోర్, నాగమణి, తెల్లం మునేశ్వరరావు, ఎం.గంగ రాజు, కె.సూర్యచంద్రం, చోడెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలి..

ఏలూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో ప్రజలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బీకేఎంయూ ఆధ్వర్యంలో చాటపర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు బి.జగన్నాథరావు, బి.యేసురత్నం, బి.రాము, కె.మంగమ్మ పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

కుక్కునూరు : ఉపాధి హామీ పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ మండల సమితి కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అనంతరం తహసీల్దార్ రమేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వరకా శ్యామల, పాపారావు, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ శేషగిరిరావుకు వినతి..

ఏలూరు కార్పొరేషన్ : ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జి.వి. శేషగిరిరావుకు అందజేశారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ, సీపీఐ నాయకులు కురెళ్ల వరప్రసాద్, కొల్లూరి సుధారాణి, గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి, కొండేటి రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఏలూరు కార్పొరేషన్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కోకో, పామాయిల్, మిర్చి, అరటి పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతాంగం నష్టపోతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించడంలో వివక్షత చూపారని, అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా రైతుల ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రేషన్ నగదు బదిలీ సరికాదు : సీపీఎం

ఏలూరు కార్పొరేషన్ : రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం పేర్కొన్నారు. అన్ని నిత్యావసర సరుకులు నేరుగా పేదల ఇళ్లకే వెళ్లి పంపిణీ చేయాలన్నారు. రేషన్ వద్దనుకుంటే నగదు ఇస్తామనే నిర్ణయం పంపిణీ వ్యవస్థను నీరుగార్చడానికి, ధరలు పెరగడానికి దారి తీస్తాయన్నారు. డీబీటీ పేరుతో పేదల కడుపు కొట్టొద్దన్నారు.

8న రాష్ట్ర స్థాయి వీలీన సభ

ఏలూరు కార్పొరేషన్ : విశాఖలో ఈ నెల 8న జరగబోవు రెండు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏపీ రాష్ట్ర స్థాయి వీలీన సభను విజయవంతం చేయాలని ఏలూరు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు పల్లి గంగరాజు పిలుపునిచ్చారు. సోమవారం ఏలూరు వీవీనగర్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏలూరు గౌరవాధ్యక్షులు యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ప్రాథమిక హక్కులను కాలరాస్తూ భావ ప్రకటన స్వేచ్ఛను సమాధి చేస్తున్నారన్నారు. ఈ మేరకు నిర్వహించే రెండు అరుణోదయ ఏపీ సాంస్కృతిక సభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఘంటసాల రాంబాబు, అరుణోదయ కళాకారులు ముంగం అప్పారావు, కుసుపూడి నాగేశ్వర రావు, మీసాల నాగరాజు, ఎస్.లక్ష్మణ, కె.నాని పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం చేయాలి

భీమడోలు : కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని, భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామ సభలు నిర్వహించి గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీలేని పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో భీమడోలు మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందనలో మండల ఎంపీడీవోకు,మండల వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు జి.ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నేడు కార్యవర్గ ప్రమాణం

ఉంగుటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం సాయంత్రం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో జరుగునని మండల శాఖ అధ్యక్షులు వేగేశ్న రంగరాజు తెలిపారు.నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర విస్తరణ అభివృద్ధి కమిటీ చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు హాజరవుతారని వివరించారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే బొలిశెట్టి

ద్వారకాతిరుమల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఆ తరువాత ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన తన మనవడు రాజేష్‌పేరున నిత్యాన్నదానానికి విరాళాన్ని అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. విశాఖ దివీస్ ల్యాబ్స్‌లో ఉద్యోగ నియామకాలకు జరిగిన ఈ జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించామని సంస్థ ప్రతినిధి రాజేశ్ తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణచైతన్య, జేకేసీ కో-ఆర్డినేటర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్‌పై పోలీసులకు ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి మార్టగేజ్ చేసిన ప్లాట్‌లను ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందకుండా క్రయ, విక్రయాలు జరిపిన బిల్డర్ వై.జగన్నాథరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సూర్య కళాశాల రోడ్డులో విక్టరీ ప్రైడ్ అపార్ట్‌మెంట్ లో మున్సిపాలిటీకి రిజిస్టర్ చేసిన నాలుగు ప్లాట్లలో రెండింటిని బిల్డర్ జగన్నాథరాజు అక్రమంగా రిజిస్టర్ చేశారు. దీనిపై కమిషనర్, సబ్ రిజిస్ట్రార్‌కు ఇప్పటికే బిల్డర్‌కు నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదును పరిశీలిస్తామని ఎస్.ఐ. ఎస్.కె. జబీర్ తెలిపారు.

యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వేగవరంలో ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనంతో మే 27న ఢీ కొట్టిన ఘటనలో వేలేరుపాడు మండలం మేడేపల్లి గ్రామానికి చెందిన కట్టం కన్నారావు(23) కాకినాడలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనలో రోడ్డుపై నిర్లక్ష్యంగా లారీను నిలిపిన లారీ డ్రైవరుపై కేసు నమోదు చేసినట్టు హెచ్.సి.ఎన్ ఉమామహేశ్వరరావు తెలిపారు.





చికెన్ వ్యర్థాల లారీలు స్వాధీనం

పెదపాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించేలా, తాగు, సాగునీరు కలుషితం చేస్తూ చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు తరలిస్తున్న రెండు చికెన్ వ్యర్థాలతో కూడిన వాహనాలను పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. ఆయా వాహనాల్లోని సుమారు 20 వేల కిలోల చికెన్ వ్యర్థాలను పూడ్చి పెట్టించారు. ఆ వాహనాల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. కట్టా శారదసతీశ్ దర్యాప్తు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జంగారెడ్డిగూడెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక మే 29న పురుగు మందు తాగిన ఘటనలో ముంగిన కృష్ణ జ్యోతి(35) మృతి చెందింది. అప్పుల బాధ తాళలేక ముంగిన సత్యదుర్గ చంద్రరావు కుటుంబం కూల్ డ్రింక్‌లో కలుపు మందు కలుపుకుని తాగిన సంగతి తెలిసిందే.. మెరుగైన వైద్యం కోసం వీరిని గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా మరుసటి రోజు అంటే 30న భర్త చంద్రరావు మృతి చెందగా భార్య సోమవారం మృతి చెందింది. ప్రస్తుతం వారిద్దరు పిల్లలు చికిత్స పొందుతున్నారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాలను ప్రాథమిక ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం గౌరవాధ్యక్షుడు నేలపోలు ప్రభాకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సోమవారం బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా గంగరాజు బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గంగరాజు మాస్టారును సత్కరించారు. అనంతరం నేలపోలు ప్రభాకర్ మాట్లాడుతూ బాలాజీ నగర్ ప్రాంతం బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉందని హైస్కూల్‌కు వెళ్ళాలంటే బైపాస్ రోడ్డు దాటి వెళ్లాల్సి ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడానికి సహకరించాలని కోరారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.గంగరాజు మాట్లాడుతూ బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి ప్రభుత్వం అందించే ఉచిత సౌకర్యాలు కల్పించాలని కోరారు. పాఠశాల అప్‌గ్రేడ్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మద్దిపాటి నాగేశ్వరరావు, అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగా, అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణరావు, బాజీ, ఎస్ఎంసీ చైర్మన్ మంగయ్య పాల్గొన్నారు.

వంట ఏజెన్సీలకు శిక్షణ

ముసునూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం తయారీపై వంట ఏజెన్సీలకు సోమవారం ఒకరోజు శిక్షణ ముసునూరులో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, రుచిగా ఉండేలా తయారు చేయాలన్నారు. భోజనం తయారీలో తీసుకోవాల్సిన మెలకువలపై రమణ శిక్షణ ఇచ్చారు. మండల స్థాయిలో ఉన్న 38 మంది ఏజెన్సీలు ఈ శిక్షణలో పాల్గొన్నాయి. హెచ్ఎం డి.శైలజ, స్టాఫ్ సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

ఎంపీడీవో భార్గవి బాధ్యతల స్వీకారం

ఆగిరిపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఆగిరిపల్లి ఎంపీడీవో బి. భార్గవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కార్యాలయంలో యోగాంధ్ర నిర్వహించారు. మండల కార్యాలయ సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో షెడ్డును తొలగిస్తున్న అధికారులు

కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు

కైకలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భూ ఆక్రమణలను కోర్టు ఆదేశాలతో అధికారులు తొలగించారు. సోమవారం కైకలూరు కుమ్మరి బజారు ఎదురుగా ఉన్న రహదారిలో సుమారు 12 సెంట్ల స్థలంలో అక్రమంగా నిర్మాణం చేసిన భారీ రేకుల షెడ్డును కూల్చివేశారు. 2021వ సంవత్సరంలో వైసీపీ నాయకులు పలువురి స్థలాలను ఆక్రమించి భారీ రేకుల షెడ్డు నిర్మించారు. అయితే అప్పట్లో బాధితులు అప్పటి ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో అప్పట్లో హైకోర్టు ఆదేశాల మేరకు ఈ భూ ఆక్రమణలపై జరిగిన సీఐడీ ఎంక్వైరీ కైకలూరులో సంచలనాన్ని కలిగించింది. అనేక ఆధారాలను సేకరించి కోర్టుకు హాజరుపరచడంతో ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని అధికారులను ఆదేశించింది. గత ప్రభుత్వంలోనే చేయవలసి ఉండగా అప్పటి అధికారులు ఒత్తిళ్ళకు లోనై వీటిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో వారి ఆదేశాల మేరకు కైకలూరు పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం రేకుల షెడ్డును కూల్చివేసి బాధితులకు అప్పగించారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ఉత్తమ ర్యాంకులు



మంజునాథ్



సుమేద్

ఆగిరిపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పరమెట్ల గ్రామానికి చెందిన కోట మంజునాథ్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆలిండియా 471వ ర్యాంక్ సాధించారు. మంజునాథ్ చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోవడంతో పేదరికం కారణంగా చదువు చాలా కష్టంగా మారింది. 10వ తరగతి జవహర్ నవోదయ స్కూల్లో చదివి 447/500 మార్కులు సాధించాడు. ఉచిత విద్యా కార్యక్రమంలో భాగంగా ద్వారా కేకేఆర్ స్కూల్ అధినేత కోటేశ్వరరావు మంజునాథ్‌కు ఉచితంగా సీటు, వసతి ఇవ్వడంతోపాటు, ఐఐటీ జేఈఈకి సంబంధించి క్లాసులను కూడా ఉచితంగా అందించారు. తనకిష్టమైన సివిల్స్ సాధించి సమాజ సేవ చేయాలని విద్యార్థి తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఆగిరిపల్లి వర్తక సంఘం చాంబర్ అధ్యక్షుడు మానేపల్లి జగదీశ్వరరావు మనవడు సాయి సుమేద్ ఆలిండియా 255వ ర్యాంక్ సాధించాడు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

నూజివీడు టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కిరిపాటి ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 8 వారాలుగా ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం వేతన బకాయిలు విడుదల చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కర్రి రామకృష్ణ, సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, మడుపల్లి నాగేంద్రరావు, రైతు సంఘం నాయకులు బొప్పుడి రాంబాబు, ఆకునూరి విఘ్నేష్, నాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు రేషన్ అందించాలి



నూజివీడు టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం శివారు గ్రామాల్లో అందేలా చర్యలు చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, మడుపల్లి నాగేంద్రరావు మాట్లాడుతూ నూజివీడు మండలం గొల్లపల్లి శివారు వేంపాడు అగ్రహారం, ముక్కొల్లుపాడు శివారు నెహ్రూనగర్, యనమదుల శివారు రేగుంట, పల్లెర్లమూడి శివారు శోభానపురం తదితర గ్రామాల ప్రజలకు రేషన్ దుకాణాలు 5-7 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు బొప్పుడి రాంబాబు, ఆకునూరి విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర అమలు చేయాలి

ముసునూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 14 పంటల మద్దతు ధరలు రైతులకు గిట్టుబాటు కాదని, సీ టు ప్లస్ 50ని తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరికి 75 కేజీలు బస్తాకు రూ. 2151లు, మిర్చి క్వింటాలుకు రూ. 20వేలు, నాటు పొగాకు క్వింటాలుకు రూ. 10 వేలు, ప్రత్తి క్వింటాలుకు రూ. 10వేలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులకు పెట్టుబడి, కూలీ రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో వార్షిక వ్యవసాయ రంగానికి పెట్టుబడిగా బ్యాంకు రుణాల పరిమితిని పెంచి, కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చించి మద్దతు ధరలను సవరించి, రైతులకు మేలు చేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



కిక్కిరిసిన ఆటోలో పనులకు వెళుతున్న మహిళలు

పట్టించుకోండి..

పరిమితికి మించి పాసింజర్ల రవాణా

చాట్రాయి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మహిళా కూలీలు నిత్యం ప్రమాదకరంగా కిక్కిరిసిన ఆటోల్లో పనులకు వెళ్లి వస్తుండటం ఆందోళనకు గురి చేస్తున్నది. 8 నుంచి 10 మంది ఎక్కటానికి అవకాశం ఉన్న ప్యాసింజర్, ట్రక్ ఆటోలలో 15 నుంచి 20 మందిని ఎక్కించి వేగంగా దూసుకుపోతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. గతంలో ఏ గ్రామం కూలీలు ఆ గ్రామంలోనే పనులు చేసుకునే వారు. కూలీల కొరత, ప్రతి గ్రామంలో ఆటోల సంఖ్య పెరగటంతో మహిళా కూలీలు పక్క గ్రామాలు, మండలాలు, జిల్లాలకు కూడా ఉదయం పనులకు వెళ్ళి సాయంత్రం తిరిగివస్తున్నారు. తమ వ్యవసాయ పనులు సకాలంలో చేయించుకోవాలని రైతులు ఆటోలు ఏర్పాటు చేసి కూలీలను తీసుకువెళుతున్నారు. ఆటోలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఆటోల అధిక లోడు, అతి వేగానికి కళ్ళెం వెయ్యాలని పలువురు కోరుతున్నారు.

అటవీ భూములపై సమగ్ర నివేదిక ఇవ్వండి : జేసీ

భూమిని ఆక్రమించి కోళ్ల ఫారం నిర్మించారన్న ఫిర్యాదుపై పరిశీలన

చాట్రాయి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో రికార్డుల ప్రకారం అటవీ భూమి ఎంత? ప్రస్తుతం ఉన్న భూమి ఎంత? సర్వే జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చీపురుగూడెంలో టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావుకు చెందిన కోళ్ళ ఫారం అటవీ భూమిలో నిర్మించినట్లు ఫిర్యాదులు రావటంతో సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఎఫ్‌వో శుభంలతో కలిసి ఆమె పరిశీలించారు. తాను ఈ భూమిని ఓ రైతు నుంచి కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నానని, 1965 నుంచి ఇది పట్టా భూమి అని, మొత్తం 9 మంది రైతుల మధ్య క్రయ విక్రయాలు జరిగాయని, అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, రాజకీయ కక్షతోనే తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని కోళ్ళ ఫారం యజమాని బొట్టు లక్ష్మణరావు జేసీకి వివరించారు. 2023లో ఇది పట్టా భూమి అని అప్పటి తహసీల్దార్ ధ్రువీకరించగా, తరువాత ఫారెస్ట్ ఎలా అయ్యిందని జేసీ అధికారులను ప్రశ్నించారు. విలేజ్ మ్యాప్, ఇతర రికార్డులను ఆమె పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జియో కో-ఆర్డినేషన్స్ తీసుకొని డ్రోన్‌కి అప్లయ్ చేసి ఇది పట్టా భూమా? అటవీ భూమా? నిగ్గు తేల్చాలని రెవెన్యూ, అటవీ అధికారులను జేసీ ఆదేశించారు. ఆమె వెంట నూజివీడు ఎఫ్ఆర్వో సత్యనారాయణ, తహసీల్దార్ ఈశ్వరరావు, రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.



భూ రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

డ్రెయిన్ల ప్రక్షాళనతోనే ముంపు నివారణ : కామినేని



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్ల ప్రక్షాళనతోనే ముంపు సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండలం అగ్రహారం వద్ద పుల్లవ డ్రెయిన్ తవ్వకం పనులను, అటపాకలో వార్లకోడు డ్రెయిన్ తవ్వకం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో ముంపు రాకుండా ముందస్తుగా డ్రెయిన్ తవ్వకాలు చేపడుతున్నామని గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డ్రెయిన్ అభివృద్ధి పని కూడా చేపట్టకపోవడంతో 15 అడుగుల ఎత్తున కిక్కిస పెరిగిపోయి నీటి ప్రవాహానికి అవరోధంగా మారిందన్నారు. పుల్లవ డ్రెయిన్ అభివృద్ధితో ఆచవరం గ్రామం, గోపవరం, అగ్రహారం రహదారులు ముంపు బారిన పడకుండా ఉంటాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వార్లకోడు డ్రెయిన్‌ను ఎక్కడికక్కడ తవ్వకాలు జరుపుతూ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్రతి దానిని తొలగించాలన్నారు. డ్రెయిన్ల అభివృద్ధికి రూ.40లక్షల వ్యయంతో పంటు కొనుగోలు చేశామన్నారు. అభివృద్ధి పనుల్లో నీటి సంఘాలు, ప్రజాప్రతినిధులు పనిచేస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, టీడీపీ నాయకుడు బీకేఎం నాని, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, డ్రెయినేజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పేదల వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఈ సహాయనిధితో రోగులు త్వరగా కోలుకుని వారి కుటుంబాలతో సంతోషంగా గడపాలన్నారు. ఈ సందర్భంగా పది మందికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.



స్కాలర్‌షిప్ అందిస్తున్న వెంకటాచలం

స్కాలర్ షిప్ వితరణ

కలిదిండి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదలంకలో సోమవారం హైదరాబాద్ వెలమ సెంట్రల్ సంఘం మంజూరు చేసిన రూ.1,65,500 స్కాలర్‌షిప్‌ను కలిదిండి మండల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కల వెంకటాచలం 48 మంది మెరిట్ విద్యార్థులకు పంపిణీ చేశారు. వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుగ్గిరాల రంగారావు, కార్యదర్శి పోకల ప్రసాద్, సంఘ నాయకులు దున్న భోగేశ్వరరావు, కోకా పాండురంగారావు, దుగ్గిరాల చంద్రశేఖర్, ఇమ్మానేని కోటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ పాకాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెన్షన్ అందిస్తున్న దృశ్యం

డయాలసిస్ బాధితుడికి నూతన పెన్షన్ అందజేత

కలిదిండి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి అన్నారు. సోమవారం కలిదిండిలో డయాలసిస్ పేషంట్ చిట్టూరి సాంబశివరావుకి నూతన పెన్షన్ రూ.10 వేలు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెల మృతి

చాట్రాయి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో రైతు నర్సింగ చిన్న పుల్లయ్యకు చెందిన 2 పాడిగేదెలు ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఓ రైతు మోటారుకు వెళుతున్న కేబుల్ వైరు గాలికి తెగిపడగా, మేతకు వెళ్ళిన గేదెలకు ఆ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై చనిపోయాయని, వాటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని విద్యుత్ అధికారులు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు
- స్వాధీనం చేసుకున్న భూముల్లో దుక్కి దున్నిన వైనం



దుక్కి దున్నుతున్న వెంకటేశ్వర్లు

ఆగిరిపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని చిన్న ఆగిరిపల్లి హెచ్‌వో భూములు, అసైన్డ్, సీలింగ్ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలో చిన్నాగిరిపల్లి గ్రామంలో గత రెండు నెలలుగా వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన భూస్వాధీన ఉద్యమం ద్వారా భూములను స్వాధీనం చేసుకొని సదరు భూములను దప దఫాలుగా చదును చేసుకొంటూ ముళ్ళకంచెలు తొలగిస్తూ సోమవారం దుక్కి దున్ని, విత్తనాలు చల్లారు. కార్పొరేట్లకు 99 ఏళ్ళకు లీజుకు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండా, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర ఉందన్నారు. భూమిలేని పేదలకు హెచ్‌వో భూములు, అసైన్డ్, సీలింగ్ భూములు కోసం పోరాడుతుంటే రెవెన్యూ శాఖ అధికారులు మొద్దు నిద్ర పోతున్నారని విమర్శించారు. జిల్లా రెవెన్యూ అధికారులు కలుగజేసుకొని పేదలకు ప్రభుత్వ భూములను పంచాలని, సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆస్కార్ అప్పలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. రాజు, ఎం. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల వితరణ

ఆగిరిపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు కృత్రిమ అవయవాలు పొంది సాధారణ జీవితం గడపవచ్చని హీల్ సీఈవో అజయ్‌కుమార్ అన్నారు. సంఘ సేవకులు చుండూరి మధుసూదనరావు, బుజ్జమ్మ, అమెరికాకు చెందిన సోమినేని తనూజ, నిధి, నిత్య ఆర్థిక సాయంతో తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో తెనాలికి చెందిన డి. రామమోహనరావు, ఎ ముత్తయ్య, నెల్లూరుకు చెందిన జి. శ్రీనాథ్, సింగరాయకొండకి చెందిన కె గోపి, యడ్లపాడుకు చెందిన జి. శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా బంటుమిల్లికి చెందిన కె సాహిత్యలకు కృత్రిమ కాళ్ళను అమర్చారు.



లబ్ధిదారులతో దాతలు



విజేతలైన విద్యార్థులతో కోచ్ రేవంత్

కరాటే పోటీల్లో చనుబండ విద్యార్థుల ప్రతిభ

చాట్రాయి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జరిగిన 2025 జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కటా విభాగంలో చనుబండకు చెందిన విద్యార్థులు రెబ్బ గంగా వైష్ణవి ప్రథమ స్థానం, మోరంపూడి మల్లిక, రెబ్బ ఉమా సాయి దీక్షత్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు ఆర్‌డీఎస్ స్కూల్ కోచ్ మరకాల రేవంత్ తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

కృష్ణా వైపే మొగ్గు

బదిలీలకు కృష్ణా జిల్లాకే ఉద్యోగుల ఆప్షన్లు

ముదినేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ముదినేపల్లి మండలం నుంచి ఎక్కువ శాతం మంది ఉద్యోగులు కృష్ణాజిల్లా వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మండలం ఏలూరు జిల్లాలో ఉండటం, చాలా మంది ఉద్యోగులు కృష్ణాలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నందున ఆ జిల్లాకు బదిలీపై వెళ్లేందుకు ఇష్ట పడుతున్నారు. ముఖ్యంగా పంచాయతీ రాజ్, గ్రామ సచివాలయాల ఉద్యోగుల్లో అత్యధిక శాతం మంది కృష్ణా జిల్లాకు వెళ్లేందుకు సుముఖత చూపుతున్నారు. విద్యాశాఖలో ఇప్పటికే ముదినేపల్లి మండలం నుంచి బదిలీ అయిన హెచ్ఎంలంతా కృష్ణా జిల్లాలోని హైస్కూళ్లనే కోరుకుని వెళ్లిపోయారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు కూడా ఎక్కువ శాతం కృష్ణా జిల్లాకే ఆప్షన్లు ఇచ్చారు. ఇతర శాఖల ఉద్యోగులు కూడా తమ నివాస ప్రాంతాలైన గుడివాడ, విజయవాడ, పామర్రుకు సమీప మండలాలకే బదిలీని కోరుకుంటున్నారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఇప్పటికీ జడ్పీ ఉమ్మడిగానే ఉన్నందున ప్రస్తుతం బదిలీలు పూర్వపు కృష్ణా జిల్లా స్థాయిలోనే జరుగుతున్నాయి. వచ్చే ఏడాదికి ఉమ్మడి కృష్ణా జిల్లా విడిపోయి కైకలూరు నియోజక వర్గం పంచాయతీ రాజ్ పరంగా పూర్తిగా ఏలూరు జిల్లా పరిషత్తులో కలిసే అవకాశం ఉన్నందున కృష్ణా జిల్లాకు వెళ్లాలనుకునే వారికి ఇదే మంచి అవకాశమని ఉద్యోగులు భావిస్తున్నారు.

మండుతున్న ఎండలు

ముదినేపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రోహిణీ కార్తె ప్రభావం ముదినేపల్లి ప్రాంతంలో సోమవారం కనిపించింది. ఉదయం 11 గంటల నుంచి వడ గాల్పులు ప్రారంభమయ్యాయి. ఇళ్ల నుంచి జనం బయటకు వచ్చేందుకు భయపడ్డారు. ముదినేపల్లి-గుడివాడ, కైకలూరు జాతీయ రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే గురజ రోడ్డు సెంటర్‌లో జన సంచారం బాగా తగ్గింది. వ్యాపార సంస్థలను 12 గంటలకు మూసేసి సాయంత్రం 4కు తిరిగి తెరిచారు.



గంగయ్యకు అభినందన

టీడీపీ పెదగొన్నూరు గ్రామ కమిటీ ఎన్నిక

ముదినేపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదగొన్నూరు టీడీపీ కమిటీ అధ్యక్షుడిగా యార్లగడ్డ గంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాలుగేళ్లగా ఆ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న గంగయ్యనే తిరిగి సోమవారం పార్టీ కార్యకర్తలు ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి పరసా ఏడుకొండలు, మండల బీసీ సెల్ కార్యదర్శి వీరంకి చక్రపాణి, పార్టీ నాయకుడు చెల్లేటి భాస్కరరావు, చేనేత విభాగం నాయకులు నందం సాయిబాబు, దొడ్డిపట్ల సుధాకర్ కృ తదితరులు పాల్గొని గంగయ్యను సత్కరించి అభినందించారు.



మున్సిపల్ కార్యాలయంలో యోగాసన కార్యక్రమం

నూజివీడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నూజివీడు పురపాలక సంఘం కార్యాలయంలో సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది సోమవారం యోగాభ్యాసం చేశారు. ట్రైనర్లు యోగాలో వివిధ ఆసనాలను సిబ్బందితో వేయించారు. ఈ సందర్భంగా యోగా ఒక జీవన విధానమని, యోగా ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని ట్రైనర్లు తెలిపారు. యోగాంధ్ర అనంతరం కూడా ప్రతీరోజు 30 నిమిషాల పాటు యోగా చేయాలన్నారు.

తల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కన్నతల్లిని ఆమె కట్టుకున్న చీరతోనే మెడకు చుట్టి హత్య చేసిన కుమారుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని రెండవ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కృష్ణా జిల్లా విస్సన్నపేట మండలం తాటికుంట నరసాపురం గ్రామానికి చెందిన జుట్రూ మారేషు అతని భార్య లక్ష్మి లు కొంతకాలంగా ఏలూరులో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడైన జుట్రు నాగతిరుపతిరావు(22) మద్యానికి బానిసయ్యాడు. 2021 సంవత్సరంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని తల్లి లక్ష్మిని నాగతిరుపతిరావు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఆమె కట్టుకున్న చీరతోనే ఆమె మెడకు చుట్టి హతమార్చాడు. ఈ సంఘటపై లక్ష్మీ భర్త మారేషు చింతలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ కె.సి.హెచ్.స్వామి కేసు నమోదు చేయగా అప్పటి చింతలపూడి సీఐ అయిన ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎంవిఎస్ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు రెండవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. హంతకుడైన నాగ తిరుపతి రావుపై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని రెండవ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ ఎం.నాగేశ్వరరావు, చింతలపూడి సీఐ సి.హెచ్. రాజశేఖర్, చింతలపూడి ఎస్ఐ కె.కుటుంబరావు, హెడ్‌కానిస్టేబుల్ ఎం రాజేశ్‌లు సహకరించారు. హంతకుడికి శిక్ష పడటంలో ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులను ఎస్పీ కిశోర్ అభినందించారు.

ఎప్పుడిస్తారు!

(ఐదో పేజీ తరువాయి)

చొప్పున చెల్లించడానికి సిద్ధం అయ్యింది. ఈ నెల 12న పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం అయ్యే తేదీ దగ్గర పడింది. ఆ లోపే తల్లికి వందనం కింద సొమ్ములను జమ చేస్తారా లేదా అన్నది అందరిని పట్టి పీడిస్తున్న ప్రశ్న. గతంలో కేవలం ఒక్క పిల్లాడికే రూ.13 వేలు చొప్పున చెల్లిస్తే జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లలో రూ.1,069 కోట్లు ఈ ఒక్క జిల్లాలోనే ప్రభుత్వానికి భారమైంది. ఇప్పుడు గతం కంటే విద్యార్థుల సంఖ్య రెట్టింపు ఉంటుందా లేదా నాలుగు లక్షలు దాటబోతుందనేది టెన్షన్ పెడుతోంది. ఒకటికి రెండు సార్లు దరఖాస్తులను వడపోస్తున్నారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ ప్రాంతానికి వస్తే ఆ రెండింటి సొమ్ములు ఎప్పుడు ఖాతాలో వేస్తారంటూ జనం ప్రశ్నలు సంధిస్తున్నారు. కీలక సమయంలో సర్కారు సొమ్ములు కాస్తోకూస్తో జమ అయితే గట్టెక్కుతామనే భావనలో అంతా ఉన్నారు.